1

నవతెలంగాణ

నిజామాబాద్-కామారెడ్డి

మంగళవారం | మార్చి 05, 2024 | www.navatelangana.com

కత్తిపోట్ల కలకలం

- నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఘటన

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మూడవ పోలీస్ స్టేషన్ పరిధిలో కత్తిపోట్ల ఘటన సోమవారం కలకలం రేపింది. నగరంలోని మూడవ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రైల్వే లైన్ ప్రాంతంలో డబ్బుల విషయంలో ఇద్దరికీ మధ్య జరిగిన ఘర్షణలో ఒకరిని కత్తితో దాడి చేయడంతో తీవ గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికుల ముందు కత్తిపోట్ల కలకలం జరగగా మూడవ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న మూడో పోలీస్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని నిజామాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఉపాధి నిమిత్తం నగరానికి వలస వచ్చాడు. ఈ మేరకు మూడో టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సమాచారం.

అక్బర్‌నగర్‌లో చిరుత సంచారం..?

- చిరుత పులిని బంధించాలని అటవీశాఖ అధికారులకు వినతి

నవతెలంగాణ-వర్ని



గత నెల రోజుల నుంచి రుద్రూర్ మండలం అక్బర్‌నగర్ గ్రామ అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచరిస్తుందని, పశువులపై చిరుతపులి దాడిచేసిన ఘటనలున్నాయని, అటవీశాఖ అధికారులు వెంటనే బోను ఏర్పాటు చేసి చిరుతను బంధించాలని జిల్లా అటవీ శాఖ అధికారికి అంబేద్కర్ కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివారం రాత్రి ఓ రైతుకు చెందిన మేకపై దాడి చేయడంతో మృత్యువాతపడిందన్నారు. దాంతో అటవీ ప్రాంతానికి ఉపాధిహామీ పనులకు వెళ్లే కూలీలు, గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారని పేర్కొన్నారు.

విద్యార్థుల దాడిలో
డిగ్రీ విద్యార్థి మృతి

- మాస్ కాపీయింగ్ వద్దన్నందుకు ఇంటర్ విద్యార్థుల చేతిలో హతం
- బోధన్ పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చిన మృతుని బంధువులు, విద్యార్థి సంఘాలు
- పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేసిన విద్యార్థి సంఘాల నాయకులు



పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చిన మృతుచెందిన విద్యార్థి బంధువులు



వెంకట్రాం (ఫైల్)

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో దారుణం చోటుచేసుకుంది. కామరెడ్డి జిల్లా గాంధారి మండలం తిప్పరం తండా గ్రామానికి చెందిన జగ్యా నాయక్ - గోరీ బాయి దంపతుల కుమారుడు వెంకట్రావు(21) బోధన్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో పట్టణంలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. ఈ హాస్టల్‌లో ఇంటర్, డిగ్రీ విద్యార్థులు ఉంటారు. అయితే ఇంటర్ విద్యార్థి అనిల్ సోమవారం జరిగే పరీక్ష కోసం రాత్రి స్టడీ హావర్‌లో మైక్రో జిరాక్స్ చీటీలు రాస్తుండగా చీటీలు రాయవద్దని డిగ్రీ విద్యార్థి వెంకట్ రామ్ చెప్పడంతో ఆగ్రహించిన అనిల్ అతని సోదరుడు దిలీప్‌కు సమాచారం ఇచ్చాడు. దాంతో దిలీప్, లక్ష్మణ్, శివ, అనిల్, పరమేశ్ కలిసి వెంకట్రాంపై దాడికి పాల్పడ్డారు. అలాగే గొంతు గట్టిగా పట్టి లేపడంతో వెంకటరావు అక్కడిక్కడే స్పృహ తప్పి మృతిచెందాడు. దాడి చేసిన వారు అతడిని వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ క్రమంలో అక్కడున్న పోలీసులు ఘటనపై ఆరాతీయగా తమ కొట్లాటలో చనిపోయాడని చెప్పడంతో వారిని అదుపులో తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయం మృతుని గ్రామస్తులకు తెలవడంతో వారు హుటాహుటిన బోధన్‌కు తరలివచ్చారు. ఉదయం ఏసీపీ శ్రీనివాస్ బోధన్ రూరల్ సిఐ కార్యాలయానికి వచ్చేసి ఘటనపై వివరాలు సేకరించారు. సిఐ కార్యాలయంలో మృతిని కుటుంబీకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మృతుడు వెంకట్రాం అనిల్ అనే విద్యార్థికి చీటీలు రాయవద్దని చెప్పడంతో అనిల్ ఈ విషయాన్ని అతని సోదరుడికి చెప్పాడు. దాంతో దిలీప్, అనిల్, శివ, కృష్ణ, లక్ష్మణ్, పరమేష్ వీరు కలిసి వెంకట్రాంపై దాడికి పాల్పడ్డారని, అలాగే గొంతుగట్టిగా పట్టి దాడి చేయడంతో స్పృహతప్పి మృతి చెందాడని తెలిపారు. అతన్ని వారు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని తెలిపారు. డిగ్రీ విద్యార్థి మృతికి కారుకులైన వారిని అరెస్ట్ చేశామని వారిపై మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేశామని ఏసీపీ తెలిపారు.

విద్యార్థి సంఘాల నిరసన..

బీసీ హాస్టల్‌లో హాస్టల్ వార్డెన్ స్వామి నిర్లక్ష్యంతోనే ఈ ఘటన జరిగిందని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. వార్డెన్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీస్ స్టేషన్ ఎదురుగా రోడ్డుపై బైఠాయించారు. నిరసన వ్యక్తం చేస్తున్న వారిని పోలీసులు చదరగొట్టి పోలీసు వ్యాన్‌లో ఎక్కించారు. దాంతో విద్యార్థి సంఘం నాయకులను వదిలివేయాలని కోరుతూ మృతిని గ్రామస్తులు పోలీసు వ్యాన్‌కు అడ్డుగా నిలిచారు. దాంతో పోలీసులు విద్యార్థి సంఘాల నాయకులను వదిలేశారు. ఇదిలా ఉండగా ఓ విద్యార్థి సంఘం నాయకుడు అతిగా వ్యవహరించి పోలీసులకు ఇబ్బంది కలిగించడంతో అతన్ని పోలీసులు వాహనంలో ఎక్కించారు. ఈ నిరసనలో వామపక్ష విద్యార్థి సంఘం నాయకులు సంజయ్, మంగేష్, బాలరాజ్, ఏబీవీపీ విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ ఘటనలో హాస్టల్ వాచ్‌మెన్‌ను విధులలో నుంచి తొలగించారు.

మధ్యాహ్న భోజన కార్మికుల
పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలి

- సీఐటీయూ డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట ధర్నా
- ప్రజావాణిలో ఫిర్యాదు

నవతెలంగాణ-కామారెడ్డి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టి.. కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు కందరపు రాజనర్సు, వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ.. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని వాటికి తగ్గట్టుగా మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు పెంచడం లేదని, ఆరునెలలైనా ఇప్పటివరకు బిల్లులు రాలేదని అన్నారు. అలాగే 2019 నుంచి ఇప్పటివరకు పాత రెట్లే అమలవుతున్నాయి అన్నారు. ఒక గుడ్డు కొనాలంటే ఈ రోజుల్లో ఆరు రూపాయల పడుతుందని, తమకు మాత్రం ప్రభుత్వం పాత రేటు ప్రకారం నాలుగున్నర రూపాయలే చెల్లిస్తుందని వివరించారు. దీనివల్ల తాము ఒక గుడ్డుకు రూపాయి నర నష్టపోవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం తమకు గౌరవ వేతనం, బిల్లులు ఇవ్వడం లేదని, బిల్లులు రాక అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. వెంటనే బిల్లులు ఇప్పించేలా చూడాలని కోరారు. జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, సోమలింగం, కోశాధికారి, సత్యయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులు పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి



ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదుదారులు

ఎంతో బాధ, ఆవేదనతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ఫిర్యాదు దారులను ప్రేమ, ఆప్యాయతతో పలకరించి వారి సమస్యలను సావధానంగా విని పరిష్కరించాలని, లేదా పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. సోమవారం ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌తో కలిసి 72 వినతులను స్వీకరించారు. ఇందులో భూ సమస్యలకు సంబంధించి 35, ఇళ్లకు సంబంధించి 7, పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించి 13 వినతులు వచ్చాయి. అదేవిధంగా ఉద్యోగాల కోసం 5, పోలీసు, మునిసిపాలిటీ శాఖలకు సంబంధించి 3 చొప్పున, గిరిజన సంక్షేమం, మద్య నిషేధం, డీఆర్డీఓ, లీడ్ బ్యాంక్‌లకు సంబంధించి ఒక్కొక వినతిని స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూ కొలతలు, ధరణి, భూ సమస్యలకు సంబంధించి అధికంగా వినతులు వస్తున్నాయని, మండల, డివిజన్ స్థాయిలో పరిష్కారమయ్యే వాటికి తక్షణమే పరిష్కరించాలని, వాజ్యానికి సంబంధించిన సమస్యలుంటే కోర్టును ఆశ్రయించాలని, లేదా పరిష్కార మార్గాలు చూపాలని అన్నారు. అంతేగాని తరచూ అదే సమస్యలకు ప్రజావాణికి వచ్చేలా చేయరాదని ఆయా శాఖల అధికారులకు సూచించారు. పిల్లలు తమ సంరక్షణ చూడడం లేదని, బ్యాంకు లోన్ మంజూరు చేయాలని, స్కూటీ కావాలని దివ్యాంగులు వినతిపత్రాలు సమర్పించగా తగు చర్యకై జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి బావయ్యకు, చేపల పెంపకం కోసం పాంపాండ్ ఏర్పాటుకు ఋణం మంజూరు చేయాలని వచ్చిన వినతిని మత్స్యశాఖ సహాయ సంచాలకులు వరదారెడ్డికి తగుచర్యకై అందజేశారు. వ్యవసాయ, మార్కెటింగ్, మెప్మా, పంచాయతీరాజ్, మధ్యనిషేధం, మునిసిపాలిటీ తదితర శాఖలకు సంబంధించి వచ్చిన వినతులను ఆయా శాఖాధికారులకు అందజేస్తూ సత్వరమే తగుచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ చందర్ నాయక్, జిల్లా అధికారులు, రాజారామ్, దయానంద్, శ్రీనివాస్, సింహ రావు, సురేందర్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, భార్గవ్ సుధీర్, కలెక్టరేట్ ఏ.ఓ. మసూరి అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి 50 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలి

- కాయితి లంబాడిల జిల్లా అధ్యక్షులు బంతిలాల్ నాయక్

నవతెలంగాణ-బోధన్

ఇంటర్ విద్యార్థుల చేతిలో హత్యకు గురైన మృతుడు వెంకట్రాం కుటుంబానికి ప్రభుత్వం 50 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలని వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. మృతిని కుటుంబీకులు ఎన్నో ఆశలతో చదువుకోవడానికి వారి కుమారుడిని కళాశాలలో చేర్పిస్తే ఇలాంటి ఘటన జరిగిందని అది బాధాకరమని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటన జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంకట్రావు హత్యకు పాల్పడిన వారిని ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. బోధన్ పట్టణంలో డిగ్రీ విద్యార్థి హత్య ఘటన దావనంలా వ్యాపించడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కోటగిరిలో ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలో మండల అభివృద్ధి అధికారి మనోహర్ రెడ్డి ప్రజా పాలన సేవా కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను వెంటనే స్వీకరించాలని అధికారులకు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

పోలియో సర్వేను పరిశీలించిన జిల్లా అధికారి

నవతెలంగాణ-రామారెడ్డి

రామారెడ్డి పిహెచ్‌సీ పరిధిలో మండల కేంద్రంలో పల్స్ పోలియో ఇంటింటి సర్వేను సోమవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి వైద్యులు అనిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సీ వైద్యులు సురేష్ మాట్లాడుతూ.. మండల కేంద్రంలో 100శాతం పోలియో నిర్మూలన చుక్కలు పిల్లలకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూర్ ఎస్ఐపై కలెక్టర్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-నిజామాబాద్(కామారెడ్డి)

ఎస్సైపై సదాశివనగర్ మండల వాసి ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. 'నా పేరు సాయి కుమార్. నేను తలుచుకుంటే ఎవరినైనా చితకబాదుతా. నాకే ఎదురు చెబుతారా..! అంటూ భిక్కనూర్ ఎస్సై సాయికుమార్ బూతులు తిట్టి అకారణంగా అమాయకులమైన మమ్మల్ని చితకబాది, దుర్భాషలాడాడని సోమవారం ప్రజావాణిలో దీకొండ కిషన్, దీకొండ అశోక్ అనే వ్యక్తులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తమ ఫోన్లు, బైకు లాక్కొని తీవ్రంగా గాయపరిచాడని ఎస్ఐపై ఫిర్యాదు చేశారు. అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.



ఎస్ఐపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితుడు

బయోమెట్రిక్ పెట్టాలనే నిర్ణయాన్ని
ఉపసంహరించుకోవాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్

అంగన్వాడీ ఉద్యోగులను దొంగలుగా చిత్రీకరిస్తూ, అంగన్వాడీ కేంద్రాలలో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ పెట్టాలనే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శంకర్‌గౌడ్, నూర్జహాన్ మాట్లాడుతూ.. ఐసిడిఎస్ బలోపేతంపైన అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ సమస్యల పరిష్కారంపైన రాష్ట్ర ప్రభుత్వం దృష్టిపెట్టాలని, లేదంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. మార్చి 2న సీఎం రేవంత్‌రెడ్డి అంగన్వాడీ కేంద్రాలలో పోషకాహారం దుర్వినియోగం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దీనికోసం అంగన్వాడీ కేంద్రాలలో సిసి కెమెరాలు, బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశ పెట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు పత్రికల్లో వచ్చిందని, అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్‌ను దొంగలుగా ఆరోపించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచి, ఎలా బలోపేతం చేయాలనే అంశాలు సమావేశంలో చర్చించలేదని తెలిపారు. 48 సంవత్సరాలుగా పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కారం కోసం తీసుకునే చర్యలు సమావేశంలో చర్చించలేదని, అన్నింటినీ పక్కన బెట్టి పేద ప్రజల కోసం నిరంతరం సేవలందిస్తున్న అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ అవినీతిపరులని ఆరోపించడం అత్యంత దుర్మార్గమన్నారు. ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే వెనక్కి తీసుకోవాలన్నారు. ఐసిడిఎస్ 1975 అక్టోబర్ 2న ఏర్పడిందని, 48 సంవత్సరాలు కావొస్తున్నా 60శాతం కేంద్రాలకు పక్కా భవనాలు లేవన్నారు. 90శాతం కేంద్రాలకు బాత్రూములు, మంచినీటి సౌకర్యం, కరెంట్, కాంపౌండ్‌వాల్స్ లేవని తెలిపారు. ఐసిడిఎస్‌తో పాటు బి.ఎల్.ఓ ప్రభుత్వం చెప్పే అనేక సర్వేలు చేస్తున్న అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేయకుండా దొంగలుగా చిత్రీకరించడం దుర్మార్గమన్నారు.

ఐసిడిఎస్ పర్యవేక్షణ కోసం సూపర్వైజర్స్, సిడిపిఓ, డిడబ్ల్యుఓలున్నారని తెలిపారు. పోషకాహారం పర్యవేక్షణ కోసం ఆన్లైన్ పోషన్ ట్రాక్టర్, ఆరోగ్యలక్ష్మి తదితర యాప్స్ అనేకం ఉన్నాయని వివరించారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణపైన ఈ యాప్స్ నిమిష నిమిషానికి ఫోటోలు అంగన్వాడీ ఉద్యోగులు పెడుతున్నారని తెలిపారు. పెట్టాల్సింది సిసి కెమెరాలు, బయోమెట్రిక్ కాదని, ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచి, బలోపేతం చేసినప్పుడు మాత్రమే అంగన్వాడీ కేంద్రాలు సజావుగా ముందుగా సాగుతాయని తెలిపారు. వీటితో పాటు క్వాలిటీతో కూడిన పోషకాహారం సప్లై చేసే విధంగా ఫుడ్ సప్లై చేసే కాంట్రాక్టు వ్యవస్థపైన ప్రభుత్వం నిఘా పెట్టాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి పి.స్వర్ణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎండిన పంట పొలాలు పరిశీలించిన ఏఈఓ

- నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-బోధన్



పొలాలను పరిశీలిస్తున్న ఏఈవో

సాలూర మండలంలోని ఫతేపూర్ గ్రామంలో నిజాంసాగర్ నీరు అందక ఫతేపూర్ శివారులో వరి పంటలు, మొక్కజొన్న పంటలు ఎండిపోయి పంట పొలాలు నెర్రెలు వారడంతో గత రెండు రోజుల క్రితం నవతెలంగాణలో కథనం ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన వ్యవసాయాధికారులు వారి ఆదేశాల మేరకు ఏఈఓ అపర్ణ సోమవారం ఫతేపూర్ శివారులో ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించారు. వరి పంట పొలాలు నెర్రెలు రావడం, వరి పంట ఎండు ముఖం పట్టడంతో ఆమె పరిశీలించారు. తాము వేల రూపాయల పెట్టుబడి పెట్టి కౌలు చేస్తే నిజాంసాగర్ నీరు అందక తీవ్రంగా నష్టపోయామని తమకు ఆత్మహత్యే శరణమని నవాబ్ జానీ అనే రైతు మందు డబ్బాలను పట్టుకొని ఏఈఓ అపర్ణ ఎదుట ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఫతేపూర్ శివారులో ఒక్క ఎకరం కూడా తడవ లేదని కానీ అధికారులేమో 100 ఎకరాలు తడిసిందని తప్పుడు సమాచారం అందజేయడం సరికాదని షేక్‌నూర్ అహ్మద్ అనే రైతు అసహన వ్యక్తం చేశారు. అధికారులు పంటలు ఎండిపోకుండా సాగునీరు అందించాలని, ఎండిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ అండర్ ట్రయల్ ఖైదీ మృతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా జైలులో అండర్ ట్రయల్ ఖైదీ తిరుమలయ్య గుండెపోటుతో సోమవారం చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. గత ఏడు నెలలుగా నిజామాబాద్ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం చద్మల్‌గుట్ట ఎర్రమన్ను కుచ్చ ప్రాంతానికి చెందిన తిరుమలయ్య(28)ను చోరీ కేసులో పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే సోమవారం 4 మార్చ్ 2024న తెల్లవారుజామున అతనికి గుండెపోటు వచ్చింది. వెంటనే తిరుమలయ్యను జైలు అధికారులు జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు.

కోటగిరిలో నర్సరీ పరిశీలన

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలోని నర్సరీని డిఎల్‌పిఓ సాయిబాబా సోమవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. నర్సరీలోని మొక్కల గురించి అశ్రద్ధ వహించవద్దని, ఎప్పటికప్పుడు కలుపు నివారిస్తూ మొక్కలను కాపాడుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. నర్సరీలో మొక్కల పరిస్థితి పట్ల కాంగ్రెస్ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఏపీఓ మారుతి, కాంగ్రెస్ నాయకులు జిల్లా డెలిగేట్ ఎంపీటీసీ కొట్టం మనోహర్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షాహిద్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, నియోజకవర్గ తెలంగాణ ఉద్యమ కారుల అధ్యక్షులు గంగాధర్ దేశాయ్ పాల్గొన్నారు.

జిల్లా ఏ.టి.ఆర్.సెంటర్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా ప్రధాన ఆసుపత్రిలోని యాంటీ రెట్రోవైరల్ థెరఫీ (ఏ.టి.ఆర్.సెంటర్) కేంద్రంలో కాంట్రాక్టు ప్రాతిపదికన స్టాఫ్‌నర్స్, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్టు పోస్టుల కోసం పనిచేయుటకు ఆసక్తి, అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ బన్సీలాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు క్యాటగిరీలలో ఒక్కో పోస్టు కలదని ప్రతి పోస్టులో మైక్రో సాఫ్ట్ కార్యాలయం (ఎం.ఎస్.ఆఫీస్), ఇంటర్నెట్, ఎలక్ట్రానిక్ మెయిల్ కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలని, ఎంపికైన వారు కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలోని ఏ.టి.ఆర్ సెంటర్‌లో పూర్తిగా కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేయవలసి ఉంటుందని, ఏకమొత్తంగా నెలకు రూ. 21,000 వేతనం చెల్లించబడుతుందని పేర్కొన్నారు. స్టాఫ్‌నర్స్ పోస్టుకు అభ్యర్థులు బి.ఎసి స్టాఫ్‌నర్స్ పూర్తిచేసి రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్‌లో రిజిస్టర్ అయి ఉండాలన్నారు. ల్యాబ్ టెక్నిసియన్‌కు గుర్తింపు పొందిన మెడికల్ లేబొరేటరీ టెక్నలజీ (ఎం.ఎల్.టి)లో గ్రాడ్యుయేషన్, డిప్లొమా పూర్తి చేసి రాష్ట్ర కౌన్సిల్‌లో నమోదై ఉండాలని, అదేవిధంగా ఫార్మాసిస్టుకు గుర్తింపు పొందిన ఫార్మాసిస్టు సంస్థ నుంచి ఫార్మసీలో డిగ్రీ పూర్తి చేసి ఉండాలని, లేదా ఆరోగ్య సంరక్షణ సంస్థలో మూడు సంవత్సరాల అనుభవం కలిగి రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్‌లో రిజిస్టర్ అయి ఉండాలని స్పష్టం చేశారు. అర్హత కలిగి ఆసక్తి గల అభ్యర్థులు పక్షం రోజులలో అవసరమైన ధ్రువపత్రాలతో కామారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు చేరేవిధంగా దరఖాస్తు పంపాలని, వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించవలసినదిగా బన్సీలాల్ సూచించారు.

చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా మహిళా శిశుసంక్షేమాధికారి బావయ్య

నవతెలంగాణ-కామారెడ్డి

సమాజంలో మహిళల రక్షణకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి బావయ్య అన్నారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాలలో భాగంగా మూడవ రోజైన సోమవారం జిల్లా కేంద్రంలోని మంజీరా డిగ్రీ కళాశాలలో మహిళలకు వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్, రంగోలి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో సగభాగమైన మహిళలు అన్ని రంగాలలో రాణిస్తూ, మహిళా సాధికారత సాధిస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వాలు ఔత్సాహికులకు శిక్షణనిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఆర్థిక సహాయం అందజేస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలని మహిళలకు సూచించారు. సమాజంలో మహిళల పట్ల ఇంకా అక్కడక్కడా కొనసాగుతున్న వివక్షత, దాడులను ఎదుర్కోవడానికి ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు చేశాయని అన్నారు. ఆపదలో అక్కున చేర్చుకునే మహిళా శిశు, సంక్షేమ శాఖ, షీటీమ్స్, న్యాయ సలహాలు అందించే వ్యవస్థలు తమ కోసం పనిచేస్తున్నాయని మహిళలు తెలుసుకోవాలని చెప్పారు. ఆపద సమయంలో టోల్ ఫ్రీ నెంబర్లను ఉపయోగించుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్, షీటీం సిబ్బంది, మహిళా సాధికారిక కేంద్ర సిబ్బంది శిరీష, సౌందర్య, ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మ, సఖి టీం తదితరులు పాల్గొన్నారు.

మూడు అక్రమ ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కేసు నమోదు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా గ్రామ శివారు నుంచి మూడు అక్రమ ఇసుక ట్రాక్టర్లు వస్తుండడంతో పెట్రోలింగ్ నిర్వహించేందుకు వెళ్ళిన పోలీసులు వాటిని స్వాధీనం చేసుకొని రెంజల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు తెలియడంతో వారిపై కేసు నమోదు చేశామని స్థానిక పోలీసులు పేర్కొన్నారు.

క్రీడాకారిణి అజ్మీర ఇందుకు ఘన స్వాగతం



నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో సోమవారం అజ్మీర ఇందుకు ఘన స్వాగతం పలికారు. ఇటీవల జాతీయస్థాయిలో సాఫ్ట్‌బాల్ క్రీడల్లో కెప్టెన్‌గా వ్యవహరించి ఇందు జట్టు బంగారు పతకం సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ జి ధనవేణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని అజ్మీర ఇందు బంగారు పతకం జాతీయ స్థాయిలో సాధించినందుకు గర్వంగా ఉందని అన్నారు. అధ్యాపక బృందం, విద్యార్థినిలు ఘన స్వాగతం పలికారు.

ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు



సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-భీంగల్

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన గృహ జ్యోతి, గృహలక్ష్మి పథకాల కోసం పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సేవా కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో సంతోష్ కుమార్ సోమవారం తెలిపారు. 200 యూనిట్ల ఉచిత కరెంటు మార్చి నెల నాటికి జీరో బిల్ జనరేట్ కాకున్నా అలాగే సిలిండర్ తీసుకున్న వెంటనే 500 రూపాయల లబ్ధి రాకుంటే సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో తెలియజేశారు.

అన్ని పార్టీల నాయకులు ఒకే స్టేజీపై



ఒకే వేదికపై కూర్చున్న పలు పార్టీల నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఎన్నో సంవత్సరాల తరువాత ప్రధాన పార్టీలవారు ఒకే వేదికపై ఉండడం సంతోషాన్ని ఇచ్చిందని ప్రజలు అంటున్నారు. సోమవారం నిజామాబాద్ నగరంలో బాపూజీ వచనాలయం ప్రారంభోత్సవం చేశారు. ఈకార్యక్రమాలు ముఖ్య అతిథులుగా నిజామాబాద్ నగర మేయర్ దండు నీతు కిరణ్(బీఆర్ఎస్), ఎంపీ ధర్మపురి అరవింద్(బీజేపీ), బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి(కాంగ్రెస్), నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ (బీజేపీ), ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్(కాంగ్రెస్), ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హుందాన్ (కాంగ్రెస్), కార్పొరేటర్, ప్రముఖులు అందరూ ఒకే స్టేజి మీద కూర్చుని అభివృద్ధి కార్యక్రమాలకు హాజరాయ్యరు. గత 8, 9 సంవత్సరాలలో ఇదే మొదటి సారి అని కార్యక్రమానికి విచ్చేసిన నగర ప్రజలు, పలు పార్టీల రాజకీయ నాయకులు చర్చించుకున్నారు. గత ప్రభుత్వంలో ఎన్నడూ ఏ ఇతర పార్టీ నాయకులు హాజరుకాలేదని అంటున్నారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం వచ్చిన తరువాత ఇది నిజామాబాద్ నగరంలో అన్ని పార్టీల నాయకులు హాజరైన కార్యక్రమం కావడం విశేషం.

కారు అదుపు తప్పి బోల్తా.. ఒకరు మృతి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని తొర్లికొండ గ్రామానికి చెందిన ఒకరు కారు అదుపు తప్పి బోల్తా ఒకరు మృతి చెందారు. సాయి ప్రశాంత్(27) తన బావతో కలిసి సోమవారం బ్రాహ్మణపల్లి నుండి ఆర్మూర్ వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యలో కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో సాయి ప్రశాంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని దర్యాప్తు ప్రారంభిస్తున్నారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



బ్యాగులు అందజేస్తున్న ఎంఈవో

మండలంలోని బషీరాబాద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆంధ్రయ్య చేతుల మీదుగా స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సక్కారం అశోక్, ప్రధానోపాధ్యాయులు వి.శంకర్‌గౌడ్, చంద్ర మోహన్, ఉపాధ్యాయురాలు కవిత, నాయకులు మురళి, బందేలా రాజు, దేవేందర్, సంజీవ్ గౌడ్, ముత్తెన్న, తదితరులు పాల్గొన్నారు.

గృహహింస, ఎయిడ్స్‌పై అవగాహన



మహిళలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని పడకల్ గ్రామంలో మహిళలకు గహహింస, ఎయిడ్స్ పైన వార్డు సంస్థ ప్రతినిధులు అవగాహన కల్పించినట్లు కమ్యూనిటీ కోఆర్డినేటర్ దశరథ్ తెలిపారు. పడకల్ గ్రామంలోని గాంధీజీ గ్రామ సంఘ సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశానికి వార్డు సంస్థ వారు హాజరై సభ్యులకు గహహింస, ఎయిడ్స్ పైఅవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్, వివోఏ, 29 సంఘాల సభ్యులు హాజరు కావడం జరిగింది.

బండి సంజయ్ దిష్టి బొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బండి సంజయ్ దిష్టి బొమ్మను సోమవారం దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు రవి ప్రకాష్ మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్‌పై మండిపడ్డారు. ప్రతి ఒక్కరికీ తల్లి ఉందని, తల్లిని అవమానించడం సంస్కారహీనమని తెలిపారు. రాజకీయాలకు, తల్లికి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రవి ప్రకాష్, పంచాయతీ రాజ్ సంఘటన అధ్యక్షులు గంగాధర్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, ఎంపిటిసి వెంకటేశ్వర్ రావు, ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీర్ సింగ్, సింగిల్ విండో చైర్మన్ బుర్రోల్ల అశోక్, మట్ట రాము, అరిఫ్, లచ్చరెడ్డి, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు సలీం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను వెంటనే పంపిణీ చేయాలి

- **సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు**
- **ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి**

నవతెలంగాణ-కంఠేశ్వర్



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నిజామాబాద్ జిల్లాలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లు పూర్తి చేసి సంవత్సరాలు గడుస్తున్నాయని వెంటనే వాటిని పేదలకు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు కోరారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్‌రూం ఇండ్లు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా మారుతున్నాయని, కిటికీలను అద్దాలను ఎత్తుకు పోతున్నారని, అవి శిథిలావస్థకు చేరుకుంటున్నాయని తెలిపారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్‌తో పాటుగా మండలాల్లో అసంపూర్తిగా మిగిలిపోయిన వాటిని వెంటనే పూర్తి చేసి అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అసంపూర్తిగా మిగిలిపోయిన వాటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయటంతో పాటుగా గతంలో దరఖాస్తులు పెట్టుకున్న వారికి మాత్రమే పంపిణీ చేయాలని అన్నారు. గత ప్రభుత్వ కాలంలో పంపిణీ చేసిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో కేవలం పైరవీకారులకు అప్పటి అధికార పార్టీ కార్యకర్తలకు ఇవ్వటం జరిగిందన్నారు. ఇప్పుడు అటువంటి తప్పులు జరగకుండా చర్యలు తీసుకోవాలని పైరవీకారులకు ఆస్కారం ఇవ్వకుండా పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గత దశాబ్దాల కాలంగా ఇండ్లు ఇండ్ల స్థలాలు గత ప్రభుత్వం పంపిణీ చేయకపోవడంతో అనేక మంది నిరుపేదలు ఆశతో ఎదురుచూస్తున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సుజాత, నగర కమిటీ సభ్యులు కటారి రాములు, మహేష్, అల్వాల్ నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 131 ఫిర్యాదులు

నిజామాబాద్ సిటీ : ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 131 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతోపాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ అదనపు కలెక్టర్ కిరణ్మయి, డీఆర్డీఓ సాయాగౌడ్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను వెంటదివెంట పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్

జీజీహెచ్ ఔట్ సోర్సింగ్ నర్సింగ్ సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలి

- **సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్**

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్)లో ఔట్ సోర్సింగ్ నర్సింగ్ సిబ్బందిని విధుల్లో తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. జీజీహెచ్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ నర్సింగ్ సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం తొలగించిందన్నారు. నిజామాబాద్ జిల్లాలో పదిమందికి రాత్రికి రాత్రి డ్యూటీలను ఆపివేశారన్నారు. వీరు కోవిడ్ కాలంలో ప్రాణాలకు తెగించి పనిచేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన పర్మినెంట్ నర్సింగ్ ఆఫీసర్ల స్థానంలో పనిచేసిన వీరిని తొలగించడం అన్యాయమని తెలిపారు. వైద్యఆరోగ్య శాఖలోని వివిధ డిపార్ట్‌మెంట్లలో కాంట్రాక్ట్ పద్ధతిలో అందరిని యథావిధిగా కొనసాగించాలని అన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని ఐదు సంవత్సరాలుగా విధులు నిర్వహించిన వీరిని తొలగించడంతో కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఉద్యోగాలు తొలగించడంతో ఆవేదన చెందుతున్నారని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను యథావిధిగా విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంధ్యారాణి, శకుంతల దివ్య రేవతి శ్రీలత సల్మా, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

సంక్షేమ హాస్టల్లో అధికారులు రాత్రి బస చెయ్యాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో అధికారులు రాత్రి బస చెయ్యాలని, హత్యకు గురైన విద్యార్థికి ప్రభుత్వం న్యాయం చేయాలని, హాస్టల్లో వార్డెన్ స్వామి ని సస్పెండ్ చేయాలని టివియువి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ లాల్ సింగ్ అన్నారు. తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక గిరిజన విద్యార్థి సంఘం తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ లాల్ సింగ్, జివియస్ జిల్లా అధ్యక్షులు జైత్రాం రాథోడ్, టిఎస్ఎఫ్ జిల్లా ఇంఛార్జి మాట్లాడుతూ.. మహేష్ రెడ్డి మాట్లాడుతూ.. బోధన్‌లోని బిసి కళాశాల హాస్టల్ విద్యార్థి వెంకట్ హత్యకు గురయ్యారు. కళాశాల వసతి గృహంలో వెంకట్ డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థిపై ఆదివారం రాత్రి ఇంటర్ చదువుతున్న ఐదుగురు విద్యార్థులు వెంకట్‌పై దాడిచేయగా అక్కడికక్కడే మృతి చెందారని అన్నారు. రాత్రి వేళల్లో హాస్టల్ వార్డెన్, నైట్ వాచ్మెన్ ఉండి విద్యార్థుల పట్ల పలు జాగ్రత్తగా చూడాల్సిన అధికారులు ఈ హాస్టల్లో వార్డెన్, నైట్ వాచ్మెన్ ఉండకపోవడం వల్లనే ఇలా జరిగిందని అన్నారు. హాస్టల్ వార్డెన్ విధులపట్ల నిర్లక్ష్యం వహించిన వార్డెన్ స్వామిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

భయాన్ని వీడి శ్రద్ధతో చదివితే విజయం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న ఎస్సై మహేష్

విద్యార్థులు పరీక్షల సమయంలో భయాన్ని వీడి చదువుపై శ్రద్ధ పెడితే విజయం వరిస్తుందని నిజామాబాద్ రూరల్ ఎస్సై మహేష్ అన్నారు. నగరంలోని చంద్రశేఖర్ కాలనీలోగల జడ్పీహెచ్ఎస్‌లో సోమవారం చైతన్య సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షలపై అవగాహన, పరీక్ష ప్యాడ్లు, పెన్నుల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఐ మహేష్ హాజరై మాట్లాడారు. భయం వదిలి పట్టుదల, ఏకాగ్రతతో చదివితే మంచి మార్కులతో పాస్ అవుతారని అన్నారు. ఉదయం చదవాలని, మంచి నిద్ర ఉండాలని సకాలంలో కేంద్రాలకు వెళ్లాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సొసైటీ చైర్మన్ అండ్ ఫౌండర్ ప్రెసిడెంట్ కోయేడి నరసింహులు మాట్లాడుతూ ప్రతీది పాజిటివ్‌గా ఆలోచించాలని అన్నారు. పాస్ అవుతానని, పై చదువులు చదివి ఉద్యోగం సంపాదించి తనకాళ్లపై తాను ం నిలబడి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పేరు చేస్తాననే ధృడ సంకల్పం ఉండాలన్నారు. కార్పొరేటర్ బీ.వినోద్ మాట్లాడుతూ బాగా చదివి పరీక్షల్లో బాగా రాసి 8 నుండి 9.5 వరకు ఎవరైతే సాధిస్తారో వారికి 3 వేల నుండి 5000 వేల రూపాయల వరకు అందిస్తానని అన్నారు. స్కూల్ హెడ్ మాస్టర్ రమాదేవి మాట్లాడుతూ.. పిల్లలను ప్రోత్సహించినందుకు సొసైటీకి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పి శ్రీనివాస్, కోయేడి కిషన్ గౌడ్, శంకర్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పదవ తరగతి చదువుతున్న 28 మంది విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్ను లు పంపిణీ చేశారు.

నేడు మండల సాధారణ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ అధ్యక్షురాలు లోలపు గౌతమి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, గౌరవ సభ్యులు సకాలంలో హాజరై సహకరించాలని కోరారు. సమస్త మండల స్థాయి అధికారులు తమ తమ శాఖలకు సంబంధించిన పూర్తి అభివృద్ధి నివేదికలతో సమావేశం హాజరవ్వాలని సూచించారు.

ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు బస్సు ఏర్పాటు

నవతెలంగాణ-ఆర్మూర్

రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజీల్లో టిజిటీ, పిజిటీ, జేఎల్‌లుగా ఎంపికైన అభ్యర్థులకు సోమవారం పట్టణ కేంద్రం నుండి బస్సు ఏర్పాటు చేసినట్టు పంపినట్లు తహసిల్దార్ గజానన్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలను అందించే కార్యక్రమానికి డివిజన్ పరిధిలో ఎంపికైన అభ్యర్థులను బస్ సౌకర్యం ఏర్పాటు చేసి హైదరాబాద్‌కు పంపామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యఘర్ ముఫ్త్ యోజనను సద్వినియోగం చేసుకోవాలి

- **సీఎస్‌సీ నిజామాబాద్ మేనేజర్**
- **కామన్ సర్వీస్ సెంటర్‌లో రిజిస్ట్రేషన్ ప్రారంభం**

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) నిజామాబాద్ జిల్లా మేనేజర్ ఎం.గౌతమ్ సూచించారు. ఈ పథకానికి సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమయ్యిందని తెలిపారు. ఈ పథకం ద్వారా 40 శాతం సబ్సిడీ, 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఈ పథకాన్ని కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని అన్నారు. ఈ పథకం కింద అర్హులైన వినియోగదారుల ఇళ్ల పైకప్పు పై సోలార్ ప్లాంట్ అమర్చడడం జరుగుతుం దన్నారు.

తద్వారా సౌర విద్యుత్ వినియో గించటం తో పాటు కరెంటు బిల్లు భారం కూడా తగ్గుతుందని అన్నారు. వినియో గదారులు తమ వివరాలను కామన్ సర్వీస్ సెంటర్ సిబ్బందికి అందజేస్తే వారు ఆన్లైన్ ద్వారా నమోదు చేస్తారని సూచించారు.

తర్వాత సంబంధిత అధికారులు సోలార్ ప్లాంట్ అమరుస్తా రని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని సీఎస్‌సీ జిల్లా మేనేజర్ గౌతం తెలిపారు. మరిన్ని వివరాలకు కామన్ సర్వీస్ సెంటర్ ను సంప్రదించాలని సూచించారు.

కస్తూర్బా పిఈటికి సన్మానం

నవతెలంగాణ-భీంగల్

పట్టణ కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో పిఈటిగా విధులు నిర్వహిస్తున్న సువర్ణ పిఆర్‌టియూ ఆధ్వర్యంలో సన్మానించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పిఆర్‌టియూ ఆధ్వర్యంలో ఉత్తమ మహిళా ఉద్యోగినిగా సువర్ణను ఎంపిక చేసి సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సన్మానించి మెమోంటోను అందజేశారు. ఈ సందర్భంగా సువర్ణ మాట్లాడుతూ మండలంలో ఉత్తమ ఉద్యోగినిగా గుర్తించి అవార్డు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ స్వామి మండల పిఆర్‌టియు నాయకులు రాస దయాకర్, వాసుదేవ్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

200 యూనిట్ల విద్యుత్ ఉచితం



గృహజ్యోతి కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

గృహ జ్యోతి పథకాన్ని సోమవారం నగరంలోని పవర్‌హౌస్‌లో శాసనమండలి సభ్యులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరు పథకాల్లో ఇది ఒకటి అని, పేదవారికి, బలహీనవర్గాల వారికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. మొదటి విడతలో జీరో బిల్లు రానివారు నిరాశ పడాల్సిన అవసరం లేదని, రేషన్ కార్డు ఉండి 200 యూనిట్ల లోపల వినియోగించిన ప్రతి ఒక్క వినియోగదారుడికి ఉచిత విద్యుత్తు అందిస్తామని అన్నారు. రానివారు మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రజా పాలనలో అప్లికేషన్ సమర్పించాలని కోరారు. మాది చేతల ప్రభుత్వం తప్పకుండా ఆరు గ్యారెంటీలను తెలంగాణలో అమలు పరుస్తామని చెప్పారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఎలక్ట్రిసిటీ డిఈఎం శ్రీనివాసరావు, ఏడిఈ టౌన్ 2 తోట రాజశేఖర్, అసిస్టెంట్స్ అకౌంట్స్ ఆఫీసర్ గంగారాం నాయక్, స్థానిక కార్పొరేటర్ మృదుల అరుణ్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, కుద్దూస్ కార్పొరేటర్, కేశవేణు గడుగు గంగాధర్,నరాల రత్నాకర్, బొబ్బిలి రామకృష్ణ,, రాంభూపాల్, రామకృష్ణ విపుల్ గౌడ్, రాజేంద్రప్రసాద్, బంటు బలరాం స్థానిక డీ2 సెక్షన్ సెక్షన్ విద్యుత్ సిబ్బంది లక్ష్మణ్ ,రాజయ్య, సమియోద్దీన్, గౌస్, కృష్ణ, లక్ష్మీనారాయణ, రాములు, స్పాట్ బిల్లర్ వినయ్, చాంద్, స్థానిక వినియోగదారులు పాల్గొన్నారు.

ఉర్దూ అకాడమీ చైర్మన్‌కు సన్మానం



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా నియమితులైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తాహెర్ బిన్ హుందాన్‌ను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకెట రవి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో ను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డితో పాటు వెళ్లి కలిశారు. ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా నియమితులైనందుకు హర్షం వ్యక్తం చేస్తూ పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ నాయకులు అబ్దుల్ రఫీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణం ప్రారంభం

నవతెలంగాణ-ఏర్గట్ల



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మండలంలోని తాళ్ళ రాంపూర్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణాలను కాంగ్రెస్ మండలాధ్యక్షులు సోమ దేవరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇంచార్జ్ మంత్రి జూపెల్లి కృష్ణారావు, బాల్కొండ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డిల సహకారంతో నిధులు మంజూరయ్యాయ న్నారు. మండల పరిధిలో 45 లక్షల రూపాయల సీసీ రోడ్ల నిర్మాణాలకు, 10 లక్షల రూపాయల డ్రైనేజి నిర్మాణాలకు నిధులు మంజూరు కావడంతో పనులను మొదలు పెట్టామని తెలిపారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శివన్నోళ్ళ శివ కుమార్, రామాగౌడ్, ఆడేం గంగాప్రసాద్, గడ్డం జీవన్, ముస్కు మోహన్, పన్నాల నర్సారెడ్డి, బెజ్జారం భాను, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ ప్రతినిధి

నవతెలంగాణ-బోధన్

నిజామాబాద్ డిస్ట్రిక్ట్ కోపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ బోధన్ పరిధిలో గల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఆదేశాల మేరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు డిజిటల్ లావాదేవీలపై విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు బ్యాంకు ప్రతినిధి ఎఫ్ఎల్‌సి భాస్కర్ యాదవ్ తెలిపారు. బ్యాంకు సేవింగ్ ఖాతాలపై, పొదుపు, లావాదేవీలపై, ఇన్సూరెన్స్ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్లు కలీం, హెచ్ఎం కిషోర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గృహజ్యోతి పథకం పేదలకు వరం


జీరో కరెంట్ బిల్లును అందజేస్తున్న రమేష్ దేశాయి

నవతెలంగాణ-జుక్కల్

గృహజ్యోతి పథకం నిరుపేదలకు వరమని కేమ్రాజ్‌కల్లాలీ మాజీ సర్పంచ్ రమేష్ దేశాయి అన్నారు. సోమవారం గ్రామంలోని పలువురి పేదలకు గృహజ్యోతి పథకంలో భాగంగా రెండు వందల యూనిట్ల ఉచిత కరెంట్ బిల్లులను నేరుగా లబ్దిదారులకు అందించి ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్దిదారులనుద్దేశించి రమేష్ దేశాయి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పూర్వం నుంచి పేదలకు అండగా ఉండే పార్టీ అని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తప్పకుండా ఆరు పథకాలు

- బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి
- ఎడపల్లిలో గృహజ్యోతి పథకం ప్రారంభం

నవతెలంగాణ-ఎడపల్లి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు పథకాలను తప్పకుండా అమలు చేస్తుందని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి అన్నారు.. సోమవారం మండల కేంద్రంలో గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించారు. పేద నిరుపేద సామాన్య బడుగు బలహీన వర్గాల ప్రజలందరి కోసం ఈ పథకాలను అమలు చేసిందని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం మహిళలకు ఉచిత బస్ సౌకర్యం అమలవుతుందని ఆయన స్పష్టం చేశారు. జీరో కరెంటు బిల్లు పథకం కింద మాఫీ అవుతుందన్నారు. 200ల యూనిట్లలోపు ఉచిత కరెంటు సరఫరా ప్రజలు వాడుకుంటే అది కూడా మాఫీ అవుతుందన్నారు. ఆపై దాటిన కేటగిరి 1 వారికి బిల్లులు వస్తే తప్పకుండా చెల్లించి ప్రభుత్వానికి సహకరించాలన్నారు. అలాగే 500 రూపాయలకే ఉచిత గ్యాస్ అమలు చేస్తున్నట్లు ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వ కార్యాలయంలో పనిచేసే అధికారులు ఎవరికీ భయపడకుండా నిర్భయంగా అంకితభావంతో విధులు నిర్వహించాలని ఆయన అన్నారు. గృహజ్యోతి కింద 200 యూనిట్లలోపు బిల్లు చెల్లించకూడదన్నారు. కెసిఆర్ ప్రభుత్వ హయంలో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నెరవేరలేదన్నారు. పదేళ్ల పాలనలో ప్రజలు ఎంతో ఇబ్బందులు పడ్డారే తప్ప సుఖంగా లేకపోయారని ఆయన అన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, ఎడపల్లి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు పులి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు బిల్లా రామ్మోహన్, కాంగ్రెస్ పార్టీ మండల కోశాధికారి బొబ్బిలి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శంకర్ నాయుడు, ఎడపల్లి సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి, జెడ్పి ఉపాధ్యక్షురాలు రజిత ఎల్లయ్య యాదవ్, విద్యుత్ శాఖ ఏడిఈ రవి నాయక్, ఏఈ లైన్ఇన్‌స్పెక్టర్ రఘు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు బంజా కామప్ప, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బీజేపీలోకి బీఆర్ఎస్ ముఖ్య నాయకులు


బీజేపీలో చేరిన ముఖ్య నాయకులు

నవతెలంగాణ-నిజాంసాగర్

ఉమ్మడి మండలంలోని ప్రముఖ పారిశ్రామికవేత్త సింగీతం గ్రామవాసి కొండ అనిల్ సెట్, మల్లూరు గ్రామ బీఆర్ఎస్ ముఖ్య నాయకుడు ఒంటరి నారాయణరెడ్డి సోమవారం జహీరాబాద్ పార్లమెంట్ బిజెపి పార్టీ అభ్యర్థి అయిన బీబీ పాటిల్ సమక్షంలో బిజెపిలో చేరారు. వారికి ఎంపీ బీబీ పాటిల్ బిజెపి కండువా కప్పి సాధారంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అనిల్ సెట్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో బిబి పాటిల్ గెలుపు కోసం కృషి చేస్తామని అలాగే పార్టీని గ్రామ గ్రామాలలోకి విస్తరింప చేసి వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో కూడా బిజెపి పార్టీ గెలుపు కోసం కష్టపడతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ సీనియర్ నాయకులు బోయిని సాయిలు, డి.శ్రీకాంత్, నవీన్‌రెడ్డి, కుమ్మరి బాలు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం బోరు ఏర్పాటు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని చీనూర్ గ్రామంలో నీటి ఎద్దడి తీర్చడానికి బోరు వేసినట్టు కాంగ్రెస్ నాయకులు పర్వతరావు సోమవారం తెలిపారు. చీనూర్ గ్రామంలో తాగునీటి కొరకు ఇబ్బంది ఏర్పడడంతో స్థానిక ఎమ్మెల్యే మదన్మోహన్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి తాగునీటి కొరకు బోరు ఏర్పాటు చేసినట్టు పర్వతరావు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మురళిగౌడ్, కృష్ణ, నారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సురేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ


కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కు అందజేస్తు తహసీల్దార్

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని రైతు వేదికలో కల్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను జడ్పిటిసి తీగల తీర్మాల్‌గౌడ్, తహసీల్దార్ సంజయ్‌రావు ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబలలోని ఆడబిడ్డల కళ్యాణం కోసం ఆర్థికంగా ఆదుకోవడానికి కల్యాణలక్ష్మి పథకం అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పుట్ట బాపురెడ్డి, ఎంపీడీవో రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చంద్రయ్య గారి అనంతరెడ్డి, నాయకులు సీతారాం మధు, మద్దూరి భూపాల్‌రెడ్డి, నత్తి గణేష్, నరేందర్‌రెడ్డి, ఎంపీఓ తిరుపతిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రేఖ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో అంతా చూచిరాతే..?

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలు అంతా చూచిరాతల మయంగా సాగుతుందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కస్తూర్బాగాంధీ, మహాత్మాజ్యోతిబాపూలే, గురుకుల కళాశాల విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలలో మాస్ కాపీయింగ్ జోరుగా సాగుతున్నట్లు సమాచారం. చివరి గంట సమయంలో కొందరు ఇన్విజిలేటర్‌లే మాస్ కాపీయింగ్‌కు సహకరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రి పగలు కష్టపడి చదువుతున్న విద్యార్థులు మాస్ కాపీయింగ్ వలన నష్టపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుచున్నారు.

శ్రీ శబరిమాత ఆశ్రమంలో రూ.లక్ష మాయం

- పాలకసభ్యులే ఫోర్జరీకి పాల్పడి ఉంటారని అనుమానం

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని శ్రీ శబరిమాత ఆశ్రమంలో జమ అయిన డబ్బుల నుంచి రూ.1లక్ష మాయమైనట్లు తాడ్వాయి గ్రామం వాట్సాప్ గ్రూపులో వార్త చెక్కర్లు కొడుతుంది. గ్రామస్తులు ఈ విషయమై లోతుగా చర్చించుకుంటున్నారు. శ్రీ శబరిమాత అమ్మవారి డబ్బులను పకడ్బందీగా ఎవరు డ్రా చేసి ఉంటారని చర్చసాగుతోంది. కొందరు ఆశ్రమంలో కార్యవర్గంలో ఉంటున్న వ్యక్తులే ఆశ్రమం డబ్బులను పక్కదారి పట్టిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. గతంలో సైతం ఆశ్రమంలో అవుతున్న ఖర్చులే కాకుండా లేని ఖర్చులను కూడా జమ చేసి డబ్బులు పక్కదారి పట్టిస్తున్నట్లు పాలకవర్గంపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ఇలాగే ఆశ్రమం నిధులు పక్కదారి పడుతుంటే కొన్ని రోజులకు ఆశ్రమంలో డబ్బులు లేకుండా పోయే ప్రమాదముందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమ్మవారికి ఎంతోమంది భక్తులు విరాళంగా డబ్బులు అందిస్తూ ఉంటారు. ఈ డబ్బులను బ్యాంకులో ఆశ్రమ ట్రస్టు పాలకవర్గం పేర్లు ఉన్న ఖాతాలో జమ చేస్తారు. ఈ డబ్బులని కొందరు పాలకవర్గ సభ్యులు పనిగట్టుకుని పక్కదారి పట్టిస్తున్నట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆశ్రమం నిర్వాహకులు పకడ్బందీ చర్యలు తీసుకొని ఆశ్రమం డబ్బులు పక్కదారి పట్టకుండా తగు చర్యలు తీసుకోవాలని భక్తులు, గ్రామస్తులు కోరుతున్నారు.

సొసైటీ సీఈఓ సేవలు మరువలేనివి


పోతారెడ్డిని సన్మానించిన పలువురు

నవతెలంగాణ-బోధన్

మండలంలోని పెంటాఖుర్ద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శి పోతరెడ్డి సేవలు మరువలేనివని సొసైటీ చైర్మన్ అమర్‌నాథ్ బాబు అన్నారు. సోమవారం సొసైటీ ఆవరణలో సీఈఓ పోతారెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో అమర్‌నాథ్‌బాబు మాట్లాడుతూ.. సొసైటీ సీఈఓగా సుదీర్ఘకాలం పాటు పనిచేసి ఆయన రైతులకు ఉత్తమ సేవలందించారని కొనియాడారు. అనంతరం ఆయనను వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, రైతులు, డైరెక్టర్లు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ప్రస్తుత ఇంచార్జి సీఈవోగా రావుఫ్‌ను నియమిస్తున్నట్లు అసిస్టెంట్ రిజిస్టర్ రవీంద్రబాబు వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ రమేష్‌గౌడ్, పెంటాఖుర్దు మాజీ సర్పంచ్ వీరన్న పటేల్, సాలురా పిఎసిఎస్ సిఈఓ బస్వంత్‌రావు, మానిటరింగ్ అధికారి అరుణ్ కుమార్, పెద్దలు శివ సాయి పటేల్, సంఘ డైరెక్టర్లు, రైతులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, వివిధ కంపెనీల ఉద్యోగస్తులు, బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బంగారు తెలంగాణ వచ్చిన మా రాతలు మారలే

- నియోజకవర్గ ఉద్యమకారుల అధ్యక్షుడు గంగాధర్ దేశాయ్

నవతెలంగాణ-కోటగిరి


మాట్లాడుతున్న ఉద్యమకారుల అధ్యక్షుడు గంగాధర్ దేశాయ్

బంగారు తెలంగాణ వచ్చిన మా రాతలు మారలేదని నియోజకవర్గ ఉద్యమకారుల అధ్యక్షుడు గంగాధర్ దేశాయ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని బాన్సువాడ నియోజకవర్గ తెలంగాణ ఉద్యమకారుల ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గ ఉద్యమకారుల అధ్యక్షుడిగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు గంగాధర దేశాయిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1200 మంది తెలంగాణ ఉద్యమంలో తమ ప్రాణాలను కోల్పోవడం జరిగిందని, బంగారు తెలంగాణ వస్తే బావి భవిష్యత్తు బాగుంటుందని కలలు కన్నామని, కానీ కెసిఆర్ నాయకత్వంలో అరవు వచ్చిన వాళ్లకి అందలమెక్కించారని, మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలో వారిని మరలా తీసుకుంటూ ఉద్యమకారులను అణచివేస్తున్నారని, మరలా తెలంగాణలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. నీళ్లు, నిధులు, నియమకాలతో పాటు ఉద్యమకారులకు ప్రభుత్వం పింఛన్ సౌకర్యం కలిగించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని లేనియెడల ఉద్యమాలు చేస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గంగాధర్ దేశాయ్, ఉపాధ్యక్షులుగా మాధవ్, కార్యదర్శిగా జయరాం తదితరులను ఎన్నుకున్నారు.

సొసైటీ ప్రహరీ గోడ నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-బోధన్

మండలంలోని పెంటాకలాన్ గ్రామంలో సొసైటీ భవనానికి ప్రహరీ గోడ నిర్మాణానికి సొసైటీ చైర్మన్ రాజారెడ్డి సోమవారం భూమిపూజ నిర్వహించారు. ప్రహరీ గోడ నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా రూ.10లక్షల మంజూరి అయ్యాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు యాతాలం దమ్మయ్య, గోనె లస్మవ్వ, కొండపల్లి చిన్న గంగాధర్, ఆవ్వుల సుబ్బారెడ్డి, బోల్లపల్లి రాము, సార్గం పోతరెడ్డి మాజీ చైర్మన్ రమేష్‌గౌడ్, పెంటాకలాన్ మాజీ సర్పంచ్ రమణ, బోయ లక్ష్మయ్య, పెగడాపల్లి మాజీ గ్రామ సర్పంచ్ గుండారం శంకర్, బర్దిపూర్ మాజీ గ్రామ సర్పంచ్ సాయిరెడ్డి, సిబ్బంది, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన రెంజల్ సర్పంచ్‌లు

నవతెలంగాణ-రెంజల్

బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి సమక్షంలో రెంజల్ మండలం సర్పంచ్‌లు సోమవారం బీఆర్ఎస్ పార్టీని వదిలి కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో దూపల్లి సర్పంచ్ శనిగరం సాయిరెడ్డి, వీరన్నగుట్ట తండా సర్పంచ్ జాదవ్ గణేష్‌నాయక్, మౌలాలి తాండ సర్పంచ్ జాదవ్ సునీత బాబునాయక్, దండిగుట్ట సర్పంచ్ భర్త కృష్ణారావు, వీరన్నగుట్ట తండా ఉపసర్పంచ్ వీరేందర్ నాయక్, కాంగ్రెస్ పార్టీలో చేరారు.

తాండూర్‌లో విజ్ఞాన కేంద్రం ఏర్పాటు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని త్రిలింగ రామేశ్వర ఆలయ ఆవరణలో విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆలయ ధర్మకర్త దత్తు తెలిపారు. రాఘవపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ కరణం సత్య నారాయణ రెండు లక్షల విలువ చేసే విజ్ఞాన కేంద్రాన్ని శ్రీ లింగేశ్వర ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసి ఆలయానికి అప్పగించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు దత్తు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పురాతన అద్భుతమైన శ్రీ లింగేశ్వర ఆలయానికి ప్రతిరోజు భక్తుల తాకిడి పెరగడంతో ఆలయానికి వచ్చిన భక్తులు గ్రంథ పఠనం, ధ్యానం, సత్సంగం చేయడానికి విజ్ఞాన కేంద్రాన్ని నిర్మించి ఆలయానికి అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వారి వెంట వెంకట్రామిరెడ్డి, శ్యామ్‌రావు, చంద్రమోహన్, సుహాస్‌రెడ్డి, శంకరయ్య, దుర్గయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.


త్రిలింగ రామేశ్వర ఆలయ విజ్ఞాన కేంద్రం వద్ద పలువురు

మహిళ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

నవతెలంగాణ-రెంజల్


ఉపాధ్యా మహిళలను సన్మానించిన పలువురు

మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని మహిళా ఉపాధ్యాయులను పిఆర్టియు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించినట్టు పిఆర్టియు మండలాధ్యక్షుడు టి.సోమలింగంగౌడ్ పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో మహిళ ఉపాధ్యాయులను శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించినట్టు ఆయన తెలిపారు. సన్మాన గ్రహీతలలో రెంజల్ మండలం నుంచి కె.శోభారాణి (ఎంపీపీఎస్) దండిగుట్ట, నాజ్ ఫాతిమా (ఎంపిపిఎస్) నీలా, ఆదర్శ పాఠశాల జ్యోతిని సన్మానించినట్టు వివరించారు. కార్యక్రమంలో పిఆర్టియు జిల్లా గౌరవ అధక్షులు ఇల్తేపు శంకర్, పిఆర్టియూ రెంజల్ మండలాధ్యక్ష కార్యదర్శులు టి.సోమలింగంగౌడ్, సాయారెడ్డి, అసోసియేట్ మండలాధ్యక్షులు రఫిక్ హులాల్ తాహెర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కిషోర్‌కుమార్, మండలంలోని స్థానిక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటగిరి బిజెపి మండలాధ్యక్షుడుగా వేముల నవీన్



నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి బిజెపి మండలాధ్యక్షుడుగా వేముల నవీన్ నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో తన వంతు కృషి చేస్తానని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మోడీ అడుగుజాడలలో ప్రతి ఒక్కరికి అందేవిధంగా కృషి చేస్తానని వేముల నవీన్ పేర్కొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సోమవారం ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ రాజదాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులు తమకు ఎలాంటి సందేహాలు ఉన్న ప్రజాపాలన సేవ కేంద్రంలో పరిష్కరించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీడీవో పర్బన్న, ఎంపీవో శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ వెంకటరామిరెడ్డి, సూపరిడెంట్, తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులు టార్గెట్ వెంటనే పూర్తి చేయాలి

- డిఎల్‌పిఓ సాయిబాబా

నవతెలంగాణ-కోటగిరి

కార్యదర్శులు టార్గెట్ వెంటనే పూర్తి చేయాలని డిఎల్‌పిఓ సాయిబాబా తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మాట్లాడుతూ.. కార్యదర్శులకు ఇచ్చిన టార్గెట్‌ను వెంటనే పూర్తి చేయాలని, వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ కృషి చేయాలన్నారు. ఈ నెల 20వ తారీకులోగా పన్ను వసూలు చేయాలని, ఎవరికి సెలవులు మంజూరు చేయవద్దని ఎంపీడీవో మనోహర్‌రెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో మారుతి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిఎల్‌పిఓ

విద్యార్థులు అన్ని రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి


సైన్స్‌ఫెయిర్‌ను సందర్శిస్తున్న జడ్పిటిసి తిర్మల్‌గౌడ్

నవతెలంగాణ-దోమకొండ

విద్యార్థులు అన్ని రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జడ్పిటిసి తీగల తీర్మల్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని త్రివేణి పాఠశాలలో సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సైన్స్‌ఫెయిర్‌ను సందర్శించి మాట్లాడుతూ.. విద్యార్థులు ఇష్టపడి చదివి అన్ని రంగాలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యార్థులు వివిధ రకాల ప్రయోగాలను ప్రదర్శించారని ప్రిన్సిపాల్ ఎండపల్లి నవీన్ కుమార్ తెలిపారు. విద్యార్థులు వివిధ రకాల ప్రయోగాలను ప్రదర్శించి వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పుట్ట బాపిరెడ్డి, విద్యార్థిని, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలకు రంగోళి, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు


మాట్లాడుతున్న అధికారి

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మార్చి 8 అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం కామారెడ్డి మంజీర డిగ్రీ కళాశాలలో మహిళలకు వివిధ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా శిశుసంక్షేమ అధికారి బావయ్య మాట్లాడుతూ.. మహిళల్లో పోరాట పటిమ ఎక్కువ అని తెలిపారు. వారు తలచుకుంటే సాధించే వరకూ వదలబోరని వివరించారు. తల్లితండ్రులు వారి ఆడపిల్లలను చదివించాలన్నారు. ప్రభుత్వం మహిళల కోసం ఏర్పాటు చేసే పథకాలను వినియోగించుకోవాలన్నారు. కార్యకరంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది, షీటీం, సఖి కేంద్రం సిబ్బంది, సూపర్వైజర్లు, కళాశాల సిబ్బంది, 200 మంది కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నిజామాబాద్
4
మంగళవారం | మార్చి 05, 2024 | www.navatelangana.com

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఎస్‌బిఐ డిచ్ పల్లి ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభమయ్యే శిక్షణలకు ధరఖస్తు చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.మగ్గం వర్క్, మహిళలకు ఉచిత టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్ మెంట్, జూట్ బ్యాగుల మేకింగ్, ఆర్టిఫీషియల్ జువెలరీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు. ఆసక్తి గల 19 నుండి 45 సంవత్సరల వయస్సు కలిగి ఉండి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల గ్రామీణ ప్రాంత యువతులు వచ్చి శిక్షణలో చేరాల్సిందిగా సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ పేర్కొన్నారు. శిక్షణా సమయంలో భోజనం, హాస్టల్‌తోపాటు శిక్షణా పూర్తిగా ఉచితంగా అందించే స్తామని, శిక్షణ అనంతరం ధృవీకరణ పత్రం, టూల్ కిట్ కూడా అందజేస్తామని వివరించారు. చిరునామా ట్రైజం సెంటర్ క్యాంపస్, వెలుగు ఆఫీస్ పక్కన డిచ్ పల్లి ఫోన్ నెంబర్ 08461-295428కు సంప్రదించాలని తెలిపారు.

పరీక్ష అట్టలు వితరణ



నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని ముచ్కూర్, పల్లికొండ గ్రామాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నిజామాబాద్ జిల్లా ఎన్ఎస్‌యూఐ ఉపాధ్యక్షులు సయ్యద్ రెహమాన్, మండల ప్రెసిడెంట్ పవన్ రెడ్డి , బాల్కొండ నియోజకవర్గ నాయకులు మొండి దినేష్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదల తో చదివితే విజయం మన దగ్గరికి వస్తుందని తెలిపారు. చదువుతో పాటు విద్యా హక్కు కోసం పోరాటం చేయాలని, మంచి మార్కులు సాధించి గురువులకు తల్లి దండ్రులకు మంచి పేరు తేవాలని అన్నారు. కార్యక్రమంలో దొనకంటి కిషన్, దోనకంటి రాజేష్, నవీన్, శివ, రాజు, జాన్సన్, భీమ్ గల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బద్దం అవినాష్, సంతోషం, మురారి, రాజ్, వినయ్, శ్రీకాంత్, సంజయ్, సాయి చరణ్, నితిన్, లోకేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

జొన్న లేప తిని రెండు గేదెలు మృత్యువాత

- 48 గేదెలకు అస్వస్థత



గేదెలకు వైద్యం చేస్తున్న పశువైద్యులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తడపాకల్ గ్రామంలో జొన్న లేప తిని రెండు గేదెలు మృతిచెందగా 48 గేదెలు అస్వస్థతకు గురయ్యాయి. రైతులు పశు వైద్యాధికారులకు సమాచారం అందివ్వడంతో వైద్యులు ఘటనా స్థలానికి చేరుకుని గేదెలకు వైద్యం అందించారు. సకాలంలో వైద్యం చేయడంతో 50 గేదెల్లో రెండు గేదెలు మృతి చెందాయి. వైద్యం అందించి గేదెల ప్రాణాలు కాపాడడంతో పశు వైద్యులను రైతులు, గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు మోర్తాడ్ గౌతమ్, వేల్పూర్ సంతోష్ రెడ్డి, ఎల్ఎస్ఎ.గంగాధర్, సిబ్బంది మధుకర్ పాల్గొన్నారు.

నీటిసమస్య, పారిశుధ్యంపై జాగ్రతలు తీసుకోవాలి

- ఎంపీడీవో సంతోష్ కుమార్



మాట్లాడుతున్న ఎంపీడీవో

నవతెలంగాణ-భీంగల్‌రూరల్

ఎంపీడీవో సంతోష్ కుమార్ సోమవారం చేంగల్ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో గల హరితహారం నర్సరీని, ఉపాధిహామీ పథకంలో నిర్మించిన కూరగాయల మార్కెట్‌ను సందర్శించారు. గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి గ్రామంలో గల నీటి సమస్య, పారిశుధ్యంపైన తగు జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ గంగా మోహన్ ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ గణేష్ మరియు పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ పరిశుద్ధము మరియు నీటి సమీక్ష సమావేశంలో గ్రామస్థాయి అధికారులు అంగన్వాడీ టీచర్లు ఆశా వర్కర్లు మరియు ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీలో లాక్కీడ్రా..

- 5 గురు పురుషులు.. 5 గురు మహిళలు ఎంపిక



లక్కీడ్రా తీసుస్తున్న రీజినల్ మేనేజర్ జాన్‌రెడ్డి

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సులో ప్రయాణించిన ప్రయాణికుల టికెట్లను డ్రా బాక్స్‌లో గత సంవత్సరం అక్టోబర్ నెలలో వేశారు, సోమవారం నిజామాబాద్ ప్రాంతీయ పరిధిలో రీజనల్ మేనేజర్ కే జాన్ రెడ్డి లక్కీ డ్రా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా-2023 పండగా సందర్భంగా నిజామాబాద్ రీజియన్ పరిధిలోని బస్ స్టేషన్లలో పురుషులు, మహిళా ప్రయాణికులకు విడివిడిగా లక్కీ డ్రా బాక్స్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. గత ఏడాది అక్టోబర్ 18 నుండి 30 వరకు ప్రయాణించిన ప్రయాణీకుల టికెట్లను డ్రా బాక్స్‌లో వేశారన్నారు. ఆబాక్సులనుండి అడిషనల్ కలెక్టర్ ఎస్ కిరణ్ కుమార్ ప్రయాణికుల సమక్షంలో 5 గురు మహిళల టికెట్లను, 5 గురు పురుషుల ప్రయాణికుల టికెట్లను తీశారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ కె.జాని రెడ్డి, డిప్యూటి రీజినల్ మేనేజర్ వి.శంకర్, డిపో మేనేజర్ - 1 బి.యస్.ఆనంద్, డిపో మేనేజర్-2 యస్.సాయన్న, పర్సనల్ ఆఫీసర్ పద్మజా, అకౌంట్స్ ఆఫీసర్ కె.యల్.యస్.రెడ్డి, ఆర్టీసి ఉద్యోగులు పాల్గొన్నారు.

ధర్మపురి ఫౌండేషన్ సేవలు అభినందనీయం

- బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జస్సు అనిల్

నవతెలంగాణ-ఆర్మూర్

ధర్మపురి అరవింద్ ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవలు అభినందనీయమని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి జస్సు అనిల్ కుమార్ అన్నారు.. పట్టణ శాఖ ఆధ్వర్యంలో బిజెపి క్యాంప్ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి పార్లమెంట్ సభ్యునిగా ధర్మపురి అరవింద్‌కు మరో అవకాశాన్ని ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు పసిపిల్లల ప్రాణప్రదాత అని, రైతు బాంధవులు, పసుపు బోర్డు సాధించిన అపర భగీరథులు అని అన్నారు. గత ఐదు సంవత్సరాలుగా ప్రజలకు సేవ చేయడమే కాకుండా అరవింద్ ధర్మపురి ఫౌండేషన్ ద్వారా అనారోగ్యంతో బాధపడే తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ముందుకు వచ్చి దాదాపు 175 మంది పిల్లలకు ఫౌండేషన్ ద్వారా సహకరించారన్నారు.

ఎంపీ అరవింద్ అడవి మామిడిపల్లి, గోవింద్ పెట్ రోడ్, ఆర్మూర్ ఆర్‌ఓబిల నిర్మాణానికి, నిజామాబాద్, బోధన్‌లో కేంద్రీయ విద్యాలయాలు, గ్రామీణరోడ్లు, జాతీయ రహదారుల నిర్మాణంకోసం నిధులు మంజూరుచేయించారన్నారు. ఈసారి రెట్టింపు మెజార్టీతో గెలిపించవలసిన అవసరం ఉందని అన్నారు. సమావేశంలో పట్టణ ప్రధాన కార్యదర్శి పులి యుగంధర్, ఉపాధ్యక్షులు ధోండి ప్రకాష్, కార్యదర్శి మిరియాల్ కర్ కిరణ్, కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షులు శేషగిరి లింగం, బీజేవైఎం పట్టణ కార్యదర్శి రెడ్డబోయిన దక్షిణమూర్తి, అముదల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాల నుంచి సహకారం ఎప్పుడూ ఉంటుంది

- ఎంపీ అరవింద్, ఎమ్మెల్యేలు
- బాపూజీ వాచనాలయానికి భూమిపూజ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎన్నో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన బాపూజీ వచనాలయం శిథిలావస్థలకు చేరుకోవడంతో దానికి పునర్ నిర్మాణం కోసం బాపూజీ వచనాలయ కమిటీ సోమవారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నగర మేయర్ దండు నీతు కిరణ్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఇతర ప్రముఖరాజకీయ నాయకులు పాల్గొని భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో బాపూజీ వచనాల అధ్యక్షులు భక్తవత్సలం (డిల్లీ) మాట్లాడుతూ.. బాపూజీ వచనానికి ఉన్న స్థలంలో భవన నిర్మాణానికి సుమారు 2 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అందుకు ఇప్పటివరకు 80 లక్షల వరకు డబ్బులను సమకూర్చుకోవడం జరిగిందని తెలిపారు. మిగతా డబ్బులను ప్రముఖ ప్రజా ప్రతినిధులు వారికి తోచిన విధంగా సహకార అందించాలని కోరారు. అందుకు ఎంపీ, ఎమ్మెల్యేలు తమ ప్రభుత్వాల నుండి సహకారం ఎప్పుడూ ఉంటుందని అన్నారు. అంతే కాకుండా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ భవన నిర్మాణానికి బాపూజీ వచనాలయ స్థలంలో ఉన్న వ్యాపార సముదాయాల వారు సహకరించాలని కోరారు ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ అనుసరిస్తున్న డిజిటల్ ఇండియా లో భాగంగా బాపూజీ వచనంలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆయన సొంత గ్రామంలో గ్రంథాలయం కోసం స్థలాన్ని కేటాయిస్తే మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆ స్థలాన్ని బస్టాండ్ కోసం, ఇతర భవన నిర్మాణాల కోసం కేటాయించాడని అన్నారు. కార్యక్రమంలో బాపూజీ వచనాలయ నిర్మాణానికి సహకరించిన రుక్మారెడ్డి మనవడు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు దినేష్ రెడ్డి లైబ్రరీలో పుస్తకాల కొనుగోలుకు ఐదు లక్షల రూపాయల అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ రాజకీయ నాయకులు, కార్పోరేటర్లు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న నాయకులు

రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలు దుర్మరణం

- అంత్యక్రియలకు వెళ్తుండగా ఘటన

నవతెలంగాణ-సదాశివనగర్

అంత్యక్రియలకు వెళ్తుండగా.. రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతిచెందారు. ఈ విషాద ఘటన మండలంలోని పద్మాజివాడి గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. సిఐ సంతోష్‌కుమార్ వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఏనుగు జనార్ధన్‌రెడ్డి(47), భార్య ప్రతిభ(36) ఇద్దరు కలిసి స్కూటర్‌పై పద్మాజీవాడి గ్రామంలో బంధువుల అంత్యక్రియలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో వెనుక నుంచి గుర్తుతెలియని ట్రక్కు వేగంగా వచ్చి వీరిని బలంగా ఢీకొట్టడంతో ప్రతిభ తలకు బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. జనార్దన్‌రెడ్డి కాళ్లు విరిగిపోవడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ఇతడిని వెంటనే కామారెడ్డి ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. తల్లి సత్యవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



దంపతుల మృతదేహాలు

కారు ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి బైపాస్ రోడ్డు 44 జాతీయ రహదారిపై కారు ఢీకొని ఒకరు మృతిచెందారు. ఎస్సై గంగాధర్ వివరాల ప్రకారం.. జక్రాన్‌పల్లి మండల కేంద్రానికి చెందిన షేక్ కరీం (58) సోమవారం జక్రాన్‌పల్లి నుంచి ఆర్మూర్ వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. వెనుక నుంచి వచ్చిన కారు లారీని ఓవర్టేక్ చేసి అదుపుతప్పి ముందువెళ్తున్న బైకును ఢీకొంది. ఈప్రమాదంలో షేక్ కరీం, నిఖిల్ కు గాయాలు కాగా 108 అంబులెన్స్ లో జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా షేక్ కరీం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. నిఖిల్ కు స్వల్ప గాయాలు కాగా పట్టణ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.. సంఘటన స్థలాన్ని ఎస్‌ఐ గంగాధర్ పరిశీలించి కొడుకు షేక్ జావీద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

ప్రైవేట్ రంగంలో ఉద్యోగ మేళా

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల 06న ఉద్యోగ మేళా నిర్వహిస్తునట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగమేళాకు వరుణ్ మోటార్స్ నిజామాబాద్ వారు నియామకాలు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. ఎగ్జిక్యూటివ్ ఈడిపి, డ్రైవర్ అడ్వైసర్, కమర్షియల్ సెల్స్ ఆఫీసర్, సెల్స్ ఎగ్జిక్యూటివ్ కమర్షియల్ సెల్స్ ఆఫీసర్, సెల్స్ ఎగ్జిక్యూటివ్, రిలేషన్ షిప్ మేనేజర్, ఉద్యోగాలు ఆర్మూర్, నిజామాబాదులో ఉన్నాయని తెలిపారు. విద్యార్హతలు ఎస్ఎస్సి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఎంబీఏ అర్హతలు గలవారికి, వేతనం 15వేల నుండి 25వేల ఇన్సెంటివ్, పిఎఫ్, ఇఎస్‌ఐ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు.

వయసు 18 నుండి 30 సంవత్సరాల వరకు ఉండాలని, ఆసక్తి గల నిరుద్యోగులు జిల్లా ఉపాధి కార్యాలయంలో ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం10 నుండి మధ్యాహ్నం 2 గంటల లోపల జిల్లా ఉపాధి కార్యాలయ, శివాజీ నగర్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు దారులు బయో డేటా, ఓటర్ ఐడి, పాసుపోర్టు సైజు ఫోటో, విద్యార్హత సర్టిఫికెట్లు తీసుకోని హాజరు కావాలని తెలిపారు. మరింత సమాచారం కోసం ఈ ఫోన్ నెంబర్ 9581768413, 9948748428, 9959456793, లకు సంప్రదించాలని కోరారు

అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తాం

- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

నవతెలంగాణ-బోధన్

బోధన్ నియోజకవర్గంలోని ప్రతి అర్హులైన కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారంటీ సంక్షేమ పథకాలను అందిస్తామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం అయనా బోధన్ పట్టణం, సంగెం గ్రామంలో గృహ జ్యోతి లబ్ధిదారులకు జీరో కరెంటు బిల్లులను అందించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోకుంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని, ఎలాంటి ఆందోళన చెందవద్దని అన్నారు. ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను మంజూరు చేసిందని ఇది ప్రజా ప్రభుత్వం అని అన్నారు. గ్యాస్ సబ్సిడీ పథకాన్ని, గృహ జ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం బోధన్ పట్టణంలో పలువురు కౌన్సిలర్లు, సాలంపాడ్, కుమ్మనపల్లి గ్రామాలకు చెందిన టిఆర్ఎస్ నాయకులు ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం శివరాత్రి ఉత్సవాలు సోమవారం నుండి ప్రారంభించడంతో బోధన్ పట్టణంలోని శివాలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. ఆయన వెంట నాయకులు గంగా శంకర్ , శరత్ రెడ్డి, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

పసుపు ఆకు నుంచి నూనె తీసే యంత్రం ప్రారంభం

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని గుమ్మిర్యాల్ గ్రామంలో ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పసుపు ఆకు నుండి నూనె తీసే యంత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ.. ఈ యంత్రానికి 15 లక్షలు ఖర్చు అవుతుందని, 12 లక్షల 50 వేల రూపాయలు ఐసీఐసీఐ ఫౌండేషన్ నుండి గ్రామంలోని మణికంఠ మహిళ సంఘానికి ఇస్తున్నామని, సంఘ సభ్యులు 2 లక్షల 50 వేల పెట్టుబడి పెట్టి వ్యాపారం మొదలుపెట్టారని తెలిపారు. పసుపు ఆకు నుండి నూనె తీసే విధానాన్ని మహిళ సంఘ సభ్యులకు అవగాహన కల్పించామని అన్నారు. ఈ యంత్రాన్ని తెలంగాణలోనే మొట్ట మొదటిసారిగా గుమ్మిర్యాల్ గ్రామంలో ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సైంటిస్ట్ లు కిరణ్, కొటేశ్వర్, శ్రీనివాస్, నిజామాబాద్ స్పైస్ బోర్డ్ డిప్యూటీ డైరెక్టర్ సుందరేశన్, ఫౌండేషన్ డెవలప్మెంట్ ఆఫీసర్ బుక్యా రాజేష్, గుమ్మిర్యాల్ మాజీ సర్పంచ్ సోమా రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నూనె తీసే యంత్రం ప్రారంభిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఆటల్లో, జీవితంలో ఆటుపోట్లు తప్పవు

- టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి
- టీయూ క్రికెట్ ఛాంపియన్ యూనివర్సిటీ పిజి టీం



నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ క్రికెట్ మెన్ టోర్నమెంట్ ఫిబ్రవరి 26 న ప్రారంభమై సోమవారం ముగిసింది. ఈ టోర్నమెంట్ లో ఉమ్మడి నిజామాబాదు జిల్లా నుండి 12 టీం లు హోరాహోరీగా పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్ లో వర్సిటీ పిజి టిమ్ తో గిరిరాజ్ గవర్నమెంట్ కళాశాల టీం తలపడగా టియూ పి జి టీం టాస్ గెలిచి బాటింగ్ ఎంచుకొని 20 ఓవర్లలో 157/4 పరుగులు సాధించి గిరిరాజ్ కళాశాల (154/9) టీం పై గెలుపొంది ఛాంపియన్షిప్‌ను కైవసం చేసుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి హాజరై క్రీడా కారులకు సర్టిఫికెట్, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ ఆటల్లోనైనా జీవితంలోనైనా ఆటుపోట్లు తప్పవని గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని తెలిపారు. క్రికెట్ ఆటలో 11 మంది క్రీడాకారులు ఐకమత్యానికి గుర్తుగా జట్టు విజయానికి కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ బాలకిషన్, చీఫ్ గార్డెన్ డా. మహేందర్ , గిర్రాజ్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బాలమణి, డా. బి. ఆర్. నేత జూనియర్ అసిస్టెంట్ నరేష్, వివిధ కళాశాలల క్రీడాకారులు పాల్గొన్నారు.

గల్ఫ్ దేశాలకు వెళ్లేవారికి శిక్షణ

నవతెలంగాణ-ఆర్మూర్

గల్ఫ్ విదేశాలకు వెళ్లాలనుకునే యువతీ, యువకులకి కంప్యూటర్ , ఏసీ మెకానిక్, ఎలక్ట్రీషన్ లో 45 రోజుల్లో శిక్షణ ఇచ్చి హైదరాబాద్ లో వివిధ కంపెనీ లలో ప్లేస్మెంట్స్ ఇవ్వడం జరుగుతుందని సాయి టెక్నికల్ ఇన్స్టిట్యూట్ జక్కుల రాజేందర్ యాదవ్ సోమవారం తెలిపారు. స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ ఇస్తామని, వివరాలకు 628151035 నెంబర్‌కు సంప్రదించాలని పేర్కొన్నారు.

సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండలంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో 2024-2025 విద్యా సంవత్సరమునకు గాను 6వ తరగతిలో గల సీట్లను భర్తీ చేయడానికి నిర్వహించబడుతున్న ప్రవేశ పరీక్షకు ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న అర్హులైన విద్యార్థిని, విద్యార్థుల నుండి ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు కోరబడుతున్నట్టు ప్రిన్సిపాల్ జి. శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారం ఆన్లైన్లో సమర్పించుటకు చివరి తేదీ (22.03.2024) వరకు ఉంటుందని, ప్రవేశ పరీక్ష 21.04.2024న నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా రిజర్వేషన్లు పాటిస్తూ విద్యార్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు https://tsemrs.telangana.gov.in వెబ్ సైటులో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి ట్రాన్స్‌కో ఇంటర్ సర్కిల్ టోర్నమెంట్ ప్రారంభం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాష్ట్రస్థాయి ట్రాన్స్‌కో ఇంటర్ సర్కిల్ టోర్నమెంట్‌లో ఫుట్‌బాల్, టగ్ ఆఫ్ వార్, అథ్లెటిక్స్, క్రీడలను సోమవారం పోలీస్ పరేడ్ లో సీఎండి టిఎస్ఎన్పిడిసిఎల్ ఐఎఎస్ కే.వరుణ్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని, ప్రతిరోజు వ్యాయామం చేసి మానసికంగా దృఢంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా టీఎస్ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ ఆపరేషన్ నిజామాబాద్ ఆర్.రవీందర్ వ్యవహరించారు. ట్రాన్స్‌కో సిఈ శ్రీరాంప్రసాద్, స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్నాథ్, రమేష్ బాబు, కామారెడ్డి ట్రాన్స్ కో ఎస్ఈ సూర్య నరసింహారావు, స్పోర్ట్స్ సెక్రెటరీ గోపి, ఉత్తర కోశాధికారి తోట రాజశేఖర టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, గంగారాం నాయక్ జాతీయకబడ్డీ కెప్టెన్, సురేశ్ కుమార్, డిఈలు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



పాల్గొన్న క్రీడాకారులు



సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలోని శ్రీ కాలభైరవ స్వామి దేవస్థాన ఆవరణలో సోమవారం రూ.5లక్షల జిల్లా పరిషత్ నిధులతో సిసి రోడ్డు పనులను జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పనులను కాంగ్రెస్ నాయకులు, కాలభైరవ స్వామి సిబ్బంది ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని సూచించిన మదన్ మోహన్‌రావుకు, నిధులను కేటాయించిన జెడ్పిటిసి మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు రామచంద్రం, సొసైటీ డైరెక్టర్ లక్ష్మాగౌడ్, ఆలయ సిబ్బంది సురేందర్, కాంగ్రెస్ నాయకులు వడ్ల లక్ష్మీరాజం, తూర్పు సుబ్బయ్య అంబాయి ప్రసాద్, నామాల రవి, పరశురాం పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తీర్చిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు ఈ విషయాన్ని స్థానికంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకుల దృష్టికి తీసుకెళ్లగా.. వారు ఈ సమస్యను ఎమ్మెల్యే మదన్మోహన్‌కు తెలియజేశారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి ఎస్సీ కాలనీలో బోర్ వేయించి నీటి సమస్య తీర్చడంతో కాలనీవాసులు, గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గాదరి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీ విభాగం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మద్దెల బాగయ్య, నాయకులు కమలాకర్, వడ్ల రాజేందర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కవీణ్, ఎస్సీ సెల్ నగర్ జనరల్ సెక్రెటరీ జగ్గ బాలరాజ్, గ్రామ అధ్యక్షులు చిందం రాజయ్య సింగర్, నాయకులు ఆస రాజు, ఆస సురేష్, బాలాజీ కొమ్ము, సాయిలు, రాజేందర్, గ్రామస్తులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధికి కృషి చేస్తా

- ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి
- షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

పార్టీలకు అతీతంగా అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు.. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో 29మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా పేద వారికి ఆడ పిల్ల పెళ్లి కోసం ప్రభుత్వం సహాయం చేస్తుందన్నారు. నియోజకవర్గంలోని నందిపేట్ మండలానికి 57, మాక్లూర్ మండలానికి 19, ఆర్మూర్‌కు 29 చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో తహసిల్దార్ గజానను, తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 19మందికి షాదీ ముబారక్ చెక్కులను ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ డి. విఠల్ రావు, స్థానిక ఎంపిటిసి వెంకటేశ్వర్ రావు, తహశీల్దార్ షబ్బీర్, ఎంపీడీఓ క్రాంతి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నందిపేట్: లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి మండలకేంద్రంలో పంపిణీ చేశారు.. ఆయన వెంట నాగ సురేష్ నర్సయ్య రాజు తదితరులు ఉన్నారు.



నందిపేట్‌లో..



మాక్లూర్‌లో..



ఆర్మూర్ లో..

షీటీం ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు




కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పలువురు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మంజీరా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో షీ టీం ఆధ్వర్యంలో మహిళా విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షిటీం ప్రతినిధి సౌజన్య మాట్లాడుతూ.. మహిళలు ఏ సమస్యనైనా తమ ధైర్య సాహసాలతో ఎదుర్కోవాలని, ఏ పరిస్థితిలోనైనా ఇబ్బందికర సమస్యలు ఏర్పడితే వెంటనే షిటీంకు సమాచారం అందించాలన్నారు. అనంతరం మంజీరా కళాశాల చైర్మన్ కేసిరెడ్డి గురువేందర్‌రెడ్డి మాట్లాడుతూ అమ్మాయిలు కళాశాలకు వచ్చే సందర్భంలో పోకిరీల వల్ల సమస్య ఎదురైతే వెంటనే తల్లిదండ్రులకు, షిటీం సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. మహిళల సమస్యలను పరిష్కరించడానికి షిటీం వెంటనే చర్యలు తీసుకుంటుందని ఈ సందర్భంగా విద్యార్థినిలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, డైరెక్టర్ సురేష్ గౌడ్, షిటీం బృందం, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్

నవతెలంగాణ-దోమకొండ

బీబీపేట్ మండల కేంద్రంలోని రైతు వేదికలో జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు సోమవారం కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల కుటుంబాలలోని ఆడపడుచుల కల్యాణం కోసం ఆర్థికంగా వారిని ఆదుకోవడానికి కళ్యాణలక్ష్మి పథకం అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పసులాది బాలమణి, ఐసిడిసిఎంఎస్ వైస్‌చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో పూర్ణ చంద్రోదయ, వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, ఎంపిటిసిలు దుంప పల్లవి, భూమేష్, కొరివి నీరజ నర్సింలు, మండల కో ఆప్షన్‌మెంబర్ మొహమ్మద్ అసిఫ్, గ్రామసెక్రెటరీ రమేష్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం.. జీరో బిల్లులు

నవతెలంగాణ-నందిపేట్

ఉచిత విద్యుత్తు పథకం అమల్లోకి రావడంతో అర్హులైన వారికి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు జీరో బిల్లును సోమవారం అందజేశారు. ఆర్మూర్ ఇంచార్జ్ వినయ్‌రెడ్డి ఆదేశాల మేరకు విద్యుత్ అధికారులతో అర్హులైన కుటుంబాలకు ఉచిత కరెంటు జీరో బిల్లులు అందజేసినట్లు మండల అధ్యక్షుడు మందమైపాల్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి నెరవేరుస్తుందని ప్రజలంతా కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో మొత్తం ఎంపీ సీట్లు కాంగ్రెస్ గెలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పెంట ఇంద్రుడు,దేగం గంగారెడ్డి,వైఎస్ గంగాధర్, బోజారెడ్డి, మైనార్టీ అధ్యక్షులు ఇషఖ్,డీసీసీ డెలిగేట్ దేవిదాస్ గౌడ్, మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు దమ్మాయి శ్రీను, గాదె శ్రీను, యూత్‌కాంగ్రెస్ మండలఅధ్యక్షులు పీరాజీ నాగరాజ్, ఏడి అశోక్, ఏఏఓ మంత్య నాయక్ పాల్గొన్నారు.



బాల్కొండలో జీరో బిల్లులు అందజేత



ముప్కాల్‌లో..



నందిపేట్ లో..

బాల్కొండ: మండల కేంద్రంలో పలువురికి గృహజ్యోతి జీరో బిల్లులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ సంజీవ్ గౌడ్, శ్రీనివాస్, యునుస్, జావీద్, శ్రీనివాస్ గౌడ్, ఉషన్న, వివేక్, సతీష్, వినేష్, ఇమ్రాన్, రియాజ్, మహేష్, రాజేశ్వర్, సంతోష్ గౌడ్,పద్మారావు, పురుషోత్తం, అయుబు, అశోక్, గంగాధర్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముప్కాల్: మండల కేంద్రంతో పాటు మడలంలోని రెంజర్ల, కొత్తపల్లి, వేంపల్లి, నల్లూర్, వెంచిర్యాల, నాగంపేట్ గ్రామాల్లో సోమవారం గృహజ్యోతి సబ్సిడీ జీరో బిల్లును ఇంటి యజమానులకు విద్యుత్ అధికారులు అందజేశారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల్లో ఒకటి 'గృహజ్యోతి' పథకంలో ఈ బిల్లులను అందజేశారు. కార్యక్రమంలో ముప్కాల్ ఏఈ రవి, ఈఈ కాంతా రావు, బిల్ కలెక్టర్ శ్రీనివాస్, లైన్ మెన్‌లు గంగా రాం, సతీష్, బిల్ ఆపరేటర్ గణేష్ పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలి



ఇంటి పన్ను చెల్లించినవారికి రసీదు అందజేత

నవతెలంగాణ-పిట్లం

పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని సెక్రటరీ యాదగిరి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఇంటి పన్ను స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశానుసారం మార్చ్ ఒకటి నుంచి ఇంటి పన్నుల, ఇతరాత్రా బకాయిల నిమిత్తం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అందుకుగానూ పంచాయతీలోని ఆయా వార్డులలోని గృహ, కిరాణం, హోటల్స్, ఫర్టిలైజర్, వస్త్ర, తదితర వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్న వారందరూ షాపుల బిల్లులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో చెవుల శ్రీను, మనోజ్‌కుమార్, బసంత్, సిబ్బంది పాల్గొన్నారు.

వైకుంఠధామ స్థలానికి చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని మోషన్‌పూర్ గ్రామానికి చెందిన ఎరుకల సాలవ్వ గ్రామ వైకుంఠధామం నిర్మాణానికి తన సొంత స్థలం 15 గుంటలు గ్రామపంచాయతీ ఇవ్వడంతో, కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆమెకు రూ.నాలుగు లక్షల 50 వేల విలువ గల చెక్కును మంజూరు చేయగా, చెక్కును సోమవారం ఎంపీడీవో సవితారెడ్డి సాలవ్వకు అందజేశారు. సంబంధిత 15 గంటల భూమి గ్రామపంచాయతీ పేరు రిజిస్ట్రేషన్ చేయించారు. కార్యక్రమంలో సాలవ్వ కుటుంబ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి నరేష్, రంగంపేట పంచాయతీ కార్యదర్శి రవి తదితరులున్నారు.

ఇంటర్ పరీక్షలకు 809 మంది గైర్హాజరు

- ఇద్దరిపై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

సోమవారం జరిగిన మొదటి సంవత్సరం గణితం-1ఏ, బోటనీ, పొలిటికల్ సైన్స్ (సివిక్స్) పరీక్షల్లో జిల్లాలో ఇద్దరిపై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాగా, 809 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారని జిల్లా ఇంటర్ విద్య అధికారి రఘురాజ్ తెలిపారు. బోధన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒక విద్యార్థి, విజేత జూనియర్ కళాశాలలో ఒక విద్యార్థి కాపీయింగ్ చేస్తుండగా ఫ్లైయింగ్ స్క్వాడ్ పట్టుకుని మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేశామని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తెలిపారు. జిల్లాలో 96 శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. జిల్లాలో మొత్తం 57 పరీక్ష కేంద్రాలకు గాను జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ, స్క్వాడ్‌ల ఆధ్వర్యంలో 47 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి సమీక్షించామని తెలియజేశారు. జిల్లా ఇంటర్ విద్య అధికారి రఘురాజ్ నిజామాబాద్‌లోనీ కాకతీయ మహిళా జూనియర్ కళాశాల, కాకతీయ ఏ, బీ పరీక్ష కేంద్రాలు, సీ.ఎస్.ఐ కళాశాలతో పాటు మరో 2 కళాశాలలు, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రవికుమార్, రజియుద్దీన్ అస్లాం, దేవరామ్ లు 6 పరీక్ష కేంద్రాలను, హైపవర్ కమిటీ డాక్టర్ చిరంజీవి ఆధ్వర్యంలో 9 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి సమీక్షించారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు 19 పరీక్ష కేంద్రాలను, సిట్టింగ్ స్క్వాడ్ లు 8 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారని తెలిపారు.

మద్నూర్ బీజేపీ అధ్యక్షులుగా తెప్పవార్ తుకారం ఎన్నిక

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ బీజేపీ మండలాధ్యక్షునిగా తెప్పవార్ తుకారాం నియామకమయ్యారు. బీజేపీ అధ్యక్షురాలు ఆదేశాల మేరకు అధ్యక్షులుగా బీజేవైఎం యువ మోర్చా నాయకులు తెప్పవార్ తుకారాంను ఎన్నుకున్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

నవతెలంగాణ-దోమకొండ

ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుతారి రమేష్ అన్నారు. బీబీపేట్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం సీఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి షబ్బీర్ అలీ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుతారి రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలోని ఇచ్చిన హామీలలో ఆరు గ్యారెంటీలలో భాగంగా నాలుగు గ్యారెంటీల పథకాలను స్వల్ప కాలంలో అమలు చేస్తుందన్నారు. ఈనెల నుంచి ఉచిత విద్యుత్‌తో జీరో విద్యుత్ బిల్లులను ప్రజలు పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు భూమాగౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎన్ఎస్ఐయు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం సోమవారం పాలాభిషేకం చేశారు. మెగా డీఎస్సీలో 11,062 టీచర్ పోస్టులకు ఉద్యోగ నోటిఫికేషన్ ఇచ్చినందుకుగాను సీఎం రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క చిత్రపటాలకు నియోజవర్గ ఎన్ ఎస్ యు ఐ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షులు బాశెట్టి శశి కుమార్ మాట్లాడుతూ తొమ్మిదిన్నర ఏళ్ల నిరుద్యోగులు టిఆర్ఎస్ ప్రభుత్వంతో కొలువుల కోసం కోట్లాడాల్సి వచ్చిందన్నారు.అప్పటి ప్రభుత్వం నిరుద్యోగులకుగొర్రెలను, బర్రెలనే ఇచ్చింది కాని కొలువులు ఇచ్చిన దాఖలలు లేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన దాదాపు గా 80 రోజుల్లో నే 25వేల ప్రభుత్వ ఉద్యోగాల కు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు.కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు అఫ్రోజ్ ఆలూర్ మండలాల అధ్యక్షులు భరత్ నాయకులు ఆదిత్య రాకేష్ సాయి కిరణ్ జగదీష్ సతీష్ అఖిల్ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

వెయ్యిబీడీలకు రూ.600 కూలి పెంచాలి

- బహుళ జన బీడీ కార్మిక సంఘం
- బీడీ యాజమాన్యం సంఘం వారికి డిమాండ్ నోటీస్ అందజేత

నవతెలంగాణ-కంఠేశ్వర్

బీడీ కార్మికులకు వెయ్యి బీడీలకు రూ.600లకు కూలి పెంచాలని తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం(బిఎల్ టీయూ) ఆధ్వర్యంలో సోమవారం బీడీ యాజమాన్య సంఘంకు డిమాండ్ నోటీసు అందజేశారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి మూల వేతన పెంపు దల 30-4-2024 నాటికి ముగుస్తుందని, 01-05-2024,నుండి, నూతన వేతన ఒప్పందం చేసుకోవాలని ది తెలంగాణ బీడీ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రకాష్, ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర గాంధీకి డిమాండ్ నోటీసు అందజేశారు. అనంతరం నిజామాబాద్‌నగరంలోని శివాజీ నగర్‌లో ఉన్న తెలంగాణ బహు జన బీడీ కార్మిక సంఘం బిఎల్ టీయూ రాష్ట్ర కార్యాలయం లో రాష్ట్ర అధ్యక్షులు యస్.సిద్ధిరాములు మాట్లాడుతూ బీడీ కార్మికులకు వెయ్యి బీడీ లకు రూ.600 కూలి పెంచాలని, బీడీ ప్యాకర్లకు ఉన్న వేతనంపై 75శాతం కూలీలు పెంచాలని, లేదా, నెలకు 26వేల జీతం ఇవ్వాలని, బట్టి, చాటన్, నెలసరి ఉద్యోగులకు 26వేల జీతం ఇవ్వాలని, నెలకు 26రోజుల చేతినిండా పని ఇవ్వాలని అన్నారు. నపాణ్యమైన తునికాకు ఇవ్వాలని తెలిపారు. జిఓ 41 ప్రకారం బీడీ కార్మికులకు వేతనాలు, కరువు భత్యం, విడిఎ, ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిఎల్ టీయూ, రాష్ట్ర ఉపాధ్యక్షులు, బి.జగదీష్, రాష్ట్ర కోషాధికారి, సయ్యద్, నాయకులు, యండి.ఘపూర్, నర్సింలు, తదితరులు ఉన్నారు.



నోటీసు అందజేస్తున్న నాయకులు

అల్ల కొండ ఊరు ఉద్భవం పుస్తకం ఆవిష్కరణ

నవతెలంగాణ - బాల్కొండ

భారత రాజ్యాంగంలో మానవ హక్కుల గురించి స్పష్టంగా లిఖించ బడిందని పుట్టిన ప్రతి మనిషి మానవహక్కుల గురించి తెలుసుకోలేక పోవడం విచారకరమని తెలంగాణ మాజీ హై కోర్ట్ న్యాయ మూర్తి, తెలంగాణ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య అన్నారు. దేశంలో మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతూనే ఉన్నాయని ఆయన అవేదన వ్యక్తం చేశారు. అలాగే మానవ జీవన విధానంలో విజ్ఞానానికి దోహద పడేదే చరిత్ర పుస్తకాలే నని అన్నారు. కానీ మానవ యాంత్రిక జీవనంలో చరిత్ర సంపదగల పుస్తకాలను చదువ లేక పోవడం విచారకరమని తెలిపారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ ఆడిటోరియంలో ఆదివారం జరిగిన జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ 2వ మహాసభల సందర్భంగా ఆయన ప్రసంగించారు. 'అల్ల కొండ ఊరు ఉద్భవం ఐదు ఆలయాలకు ప్రసిద్ధి' అనే పుస్తకాన్ని జస్టిస్ చంద్రయ్య ఆవిష్కరించారు. మానవ జీవన వికాసానికి పుస్తకాలే నిదర్శనమని బి.ఆర్.నర్సింగ్ రావు లాంటి రిటైర్డ్ ఉద్యోగి తాను పుట్టిన ఊరు ఒక నాటి అల్లకొండ నేటి బాల్కొండ పై పుస్తకాన్ని రచించి బావి తరాలకు గుర్తుండి పోయే విధంగా రచించి నందుకు ఆయన్ను అభినందించారు. 2023లో కూడా తాను తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌గా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ వివాదంలో కూడా నర్సింగ్ రావుకు తీర్పు ఇచ్చి ఆయన రచించిన పుస్తకాన్ని అవిష్కరణ చేయడం ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో జాతీయ రాష్ట్ర మానవ హక్కుల ఛైర్మన్ ఐలినేని శ్రీనివాస్ రావు, తెలంగాణ స్టేట్ చైర్మన్ సంపత్ కుమార్, మాజీ డిజిపి. లక్ష్మారెడ్డి, వివిధ రాష్ట్రాలకు చెందిన మానవ హక్కుల కౌన్సిల్ అధ్యక్షులు, కార్యదర్శులతోపాటు తెలంగాణ రాష్ట్రంలోని ప్రతినిధులు, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు కె.ప్రదీప్ రావు హాజరయ్యారు.



పుస్తకావిష్కరణలో పలువురు

రైస్‌మిల్లులో అగ్ని ప్రమాదం

- రూ.60లక్షల ఆస్తి నష్టం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని అంతంపల్లి గ్రామ శివారులో గల సప్తగిరి రైస్ మిల్లులో ఆదివారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం రైస్ మిల్లులో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చేలరేగాయి. దీంతో 48వేల గోనె సంచులు, బియ్యం, వడ్లు కాలిపోయాయి. సుమారు రూ.60లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్టు, అలాగే రెండు మోటార్లు కాలిపోయినట్లు బాధితుడు అశోక్ తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.